## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం..

పెద్దపల్లి , హాస్పిటల్‌లో చికిత్సపొందుతున్న మిత్రుడిని పరామర్శించి తిరిగి వెళ్తుండగా ప్రమాదానికి గురై ఇద్దరు యువకులు దుర్మరణం చెందిన ఘటన పెద్దపల్లి మండలం అప్పన్నపేట శివారులో గురువారం రాత్రి జరిగింది. ఈ ఘటనతో మిత్రుల మూడు కుటుంబాల్లో విషాదం అలుముకుంది. వివరాలిలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన చక్రి, శ్యామ్‌లు పెద్దపల్లికి చెందిన మిత్రుడు ఇటీవల ప్రమాదానికి గురికాగా పరామర్శించి వెళ్లేందుకు వచ్చి తిరిగి గోదావరిఖనికి వెళ్తున్నారు. ఈ క్రమంలో వారి బైక్‌ను పెద్దపల్లి మండలంలోని అప్పన్నపేట శివారులో గల పెట్రోల్ పంపు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందారు. స్థానికుల సమాచారం చేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. మృతులను చక్రి(25), శ్యామ్ (24) గా గుర్తించారు. మృతదేహాలను పెద్దపల్లి ప్రభుత్వ దవాఖానలోని మార్చురీకీ తరలించామని, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని పెద్దపల్లి రూరల్ ఎస్ఐ బీ. మల్లేష్ తెలిపారు. మృతుడు చక్రికీ భార్యతో పాటు ఏడాదిన్నర కూతురు ఉన్నారు.


# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి సంపుటి: 10 సంచిక :108 ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ తేది: శనివారం 28-06-2025 పేజీలు:4 వెల: 2.00


## మావోయిస్టుల లేఖపై స్పందించిన మంత్రి సీతక్క



ములుగు, జూన్ 27: ఆదివాసీల వ్యవహారంలో మావోయిస్టులు తనకు సంధించిన లేఖపై తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క స్పందించారు. తన మూలాలను తానెప్పుడు మరిచి పోలేదన్నారు. శుక్రవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ములుగులో మంత్రి సీతక్క విలేకర్లతో మాట్లాడుతూ.. జీవో 49ను తాను వ్యతిరేకించానని గుర్తు చేశారు. మంత్రిగా ఉండి తమ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యేలతో సమావేశం పెట్టానని వివరించారు. ఆ క్రమంలో ఆదివాసీల జోలికి వెళ్లవద్దని అటవీశాఖ అధికారులకు మంత్రి కొండా సురేఖతోపాటు తానూ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. కొందరు రాజకీయ నాయకుల ప్రోద్బలంతో ఒకరిద్దరు అటవీశాఖ అధికారులు తప్పా.. ఎవరూ ఆదివాసీల జోలికి వెళ్లడం లేదని మంత్రి సీతక్క వివరణ ఇచ్చారు. అయితే ఎవరు మాట్లాడినా నిజాలు మాట్లాడాలంటూ మావోయిస్టులకు ఆమె పరోక్షంగా సూచించారు. ఆదివాసీల వ్యవహారంపై ఇవాళ(శుక్రవారం) ఉదయం మంత్రి సీతక్కకు మావోయిస్టులు లేఖ రాశారు. ఈ లేఖలో వారు ఏమన్నారంటే.. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో కీలక మంత్రిగా పని చేస్తున్న మాజీ మావోయిస్టు సీతక్క.. ఆదివాసీల హక్కుల గురించి కనీసం పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో ఆదివాసీల హక్కులకు పూర్తి బాధ్యత మంత్రి సీతక్కదేనని స్పష్టం చేశారు. జీవో నెంబర్ 49తో కుమురం భీమ్ జిల్లాలోని 339 ఆదివాసీ గ్రామాలను ఖాళీ చేయించాలని ప్రభుత్వం చూస్తోందని మండిపడ్డారు. ఈ జీవో 49 కారణంగా రాష్ట్రంలో మూడు జిల్లాలు కనుమరుగవుతున్నాయంటూ ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టేందుకే జీవో నెం. 49 తీసుకువచ్చారంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఈ జీవోను వెంటనే రద్దు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాగా, ఈ లేఖపై మంత్రి సీతక్క వెంటనే స్పందించి వివరణ ఇచ్చారు

## తలతిక్క పనులు చేశారు కాబట్టే బీఆర్ఎస్‌ను ప్రజలు తిరస్కరించారు



ఆదిలాబాద్ : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పర్యటించిన రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, బీఆర్ఎస్ పాలనపై తీవ్ర విమర్శలు చేశారు. మీడియాతో మాట్లాడుతూ ఆయన బహిరంగంగా వ్యాఖ్యానిస్తూ, గత ప్రభుత్వ హయాంలో ఫోన్ ట్యాపింగ్‌లపై సంచలన వ్యాఖ్యలు చేశారు. తన ఫోన్‌ను కూడా ట్యాప్ చేశారని ఆయన ఆరోపించారు. తలతిక్క పనులే బీఆర్ఎస్‌ను తిరస్కరించేలా చేశాయి అని జూపల్లి వ్యాఖ్యానించారు. ఇలాంటివి ఆదర్శ పాలనకు దూరమైన చర్యలు. ప్రజాస్వామ్యంలో నైతిక విలువలకే అవమానం అని ధ్వజమెత్తారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టు సహా ఇతర కీలక అంశాల్లో ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారని, అందుకే కాళేశ్వరం పై విచారణకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కమిషన్‌కు అవసరమైన అన్ని పత్రాలు సమర్పించబోతున్నామని అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను అభివృద్ధిపథంలోకి తీసుకురావడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. "రాజకీయ ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చేలా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోంది. ఎలాంటి ఎన్నికలు జరిగినా, కాంగ్రెస్ పార్టీ అధిక స్థానాలు గెలుస్తుందనే నమ్మకం ఉంది" అని జూపల్లి ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పరిపాలన ద్వారా మార్పులు తీసుకువస్తామని, పార్టీ నేతల మధ్య విభేదాలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. అందరూ కలిసి కాంగ్రెస్‌ను బలోపేతం చేస్తామన్నారు. బీజేపీపై విమర్శలు చేస్తూ, "తెలంగాణకు బీజేపీ చేసినదేమీ లేదు. బీహార్, ఉత్తరప్రదేశ్‌కు అధిక నిధులు కేటాయిస్తూ, తెలంగాణకు మొండి చేయి చూపుతోంది. ఎటువంటి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేదు" అని మండిపడ్డారు. తెలంగాణ సాధనలో కాంగ్రెస్ పాత్రను గుర్తుచేస్తూ, "ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ నష్టం జరిగినా, తెలంగాణ బిడ్డల ప్రాణత్యాగాలను చూసి మానవీయతతో సోనియా గాంధీ ప్రత్యేక రాష్ట్రంగా ప్రకటించారు" అని జూపల్లి గుర్తు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తూ – "అవి ప్రజావ్యతిరేక పాలనలే. అవినీతి, కుటుంబ పాలన, అప్రజాస్వామిక విధానాల వల్ల ప్రజలు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచారు" అని ధ్వజమెత్తారు. తాజా పరిస్థితిని ప్రస్తావిస్తూ – "రెవెన్యూలో తీవ్ర సమస్యలు ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీలను అమలు చేస్తున్నారు. గత ప్రభుత్వ పథకాల్ని కొనసాగిస్తూ ప్రజలపై నిబద్ధతను చూపిస్తున్నారు" అని మంత్రి వివరించారు.

## చైనాతో ఉద్రిక్తతలకు ముగింపు దిశగా భారత్..

న్యూఢిల్లీ, చైనాలో షాంఘై సహకార సంస్థ సమ్మిట్ లో భారత రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాల్గొన్నారు. ఆ తర్వాత బీజింగ్ రక్షణ శాఖ మంత్రి అడ్మిరల్ డాంగ్‌జున్‌తో ఆయన ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడటం, సరిహద్దుల్లో సమస్యలు రాకుండా ఉండేందుకు చేపట్టాల్సిన చర్యలపై వీరిద్దరూ కీలక చర్చలు జరిపినట్లు తెలుస్తుంది. ఇక, ఇరు దేశాల మధ్య సరిహద్దు ఉద్రిక్తతల పరిష్కారానికి నాలుగు అంశాల ఫార్ములాను రాజ్‌నాథ్ సింగ్ ప్రతిపాదించినట్లు సమాచారం. ఇందులో బలగాల ఉపసంహరణను కొనసాగించడం, ఉద్రిక్తతలను తగ్గించుకోవడం, సరిహద్దుల గుర్తింపు–నిర్ధారణ, విభేదాలను తొలగించి ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవడం లాంటి కీలకాంశాలు ఉన్నట్లు పలు జాతీయ మీడియాల్లో కథనాలు ప్రచురితం అవుతున్నాయి. అలాగే, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని భారత్– చైనా మధ్య సంబంధాలు తిరిగి ఏర్పాటు చేసుకునేందుకు ప్రణాళికలు సిద్ధ చేసుకుంటున్నాయని రాజ్ నాథ్ సింగ్ తెలిపారు. ఇక, దాదాపు ఆరు సంవత్సరాల విరామం తర్వాత కైలాష్ మానసరోవర్ యాత్ర పునఃప్రారంభం కావడం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సానుకూల దృక్పథాన్ని కొనసాగించడంతో పాటు ద్వైపాక్షిక సంబంధానికి కొత్త సంక్లిష్టతలు రాకుండా ఇరు దేశాలు బాధ్యత తీసుకోవాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ ట్వీట్ చేశారు.




## ఆర్ఎస్ఎస్ రాజ్యాంగాన్ని ఎప్పుడు అంగీకరించలేదు..




న్యూఢిల్లీ, భారత రాజ్యాంగ పీఠిక నుంచి 'లౌకికవాదం', 'సోషలిస్ట్' అనే పదాలను తొలగించాలని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హెూసబాలే గురువారం నాడు డిమాండ్ చేశారు. అలాగే, 50 ఏళ్ల క్రితం అత్యవసర పరిస్థితిని విధించినందుకు హస్తం పార్టీపై విమర్శలు గుప్పించారు. దీంతో హెూసబాలే వ్యాఖ్యలపై ఎక్స్ (ట్విట్టర్) వేదికగా కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ తీవ్రంగా మండిపడ్డారు. ఆర్ఎస్ఎస్ రాజ్యాంగాన్ని 'ఎప్పుడూ' అంగీకరించలేదని ఆరోపించారు. అలాగే, డాక్టర్ బిఆర్ అంబేద్కర్, మాజీ ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూతో సహా దాని వ్యవస్థాపక పితామహులపై దాడులు చేస్తుందని ఆర్ఎస్ఎస్‌ను విమర్శించారు. ఇక, రాజ్యాంగంపై ఉద్దేశపూర్వకంగానే ఆర్ఎస్ఎస్ దాడి చేస్తుందని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ పేర్కొన్నారు. అయితే, ఆర్ఎస్ఎస్, బీజేపీ పదే పదే కొత్త రాజ్యాంగం కోసం పిలుపునిచ్చాయని గుర్తు చేశారు. గత లోక్‌సభ ఎన్నికల సమయంలో నరేంద్ మోడీ ప్రచార నినాదంలో ప్రస్తావించడంతో.. ప్రజలు వారిని చోట్ల తిరస్కరించారు అన్నారు. అయినప్పటికీ రాజ్యాంగం యొక్క ప్రాథమిక నిర్మాణాన్ని మార్చాలనే డిమాండ్లు ఇప్పటికీ వాళ్లు కొనసాగుతున్నారని చెప్పుకొచ్చారు. న్యాయమైన, సమగ్రమైన, ప్రజాస్వామ్య భారతదేశం కోసం డాక్టర్ అంబేద్కర్ దార్శనికతను పడగొట్టడానికి దీర్ఘకాలిక కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఆర్ఎస్ఎస్ మాటల్లోనే చెప్పాలంటే, రాజ్యాంగం మనుస్మృతి నుంచి ప్రేరణ పొందలేదని ఎద్దేవా చేశారు జైరాం రమేశ్.

## రాజా హత్య కేసులో ట్విస్ట్! మేజిస్ట్రేట్ ముందు ప్లేట్ ఫిరాయించిన నిందితులు



మేఘాలయ:హనీమూన్ మర్డర్ కేసులో ట్విస్ట్ చోటుచేసుకుంది. ఇండోర్‌కు చెందిన రాజా రఘువంశీ హత్య కేసులో నిందితులు ప్లేట్ ఫిరాయించారు. రాజాను చంపిన ఐదుగురు నిందితుల్లో ఇద్దరు నేరాన్ని ఉపసంహరించుకున్నారు. మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా నేరాన్ని అంగీకరించలేదు. మౌనంగా ఉండిపోయారు. దీంతో మేఘాలయ పోలీసులు షాక్‌కు గురయ్యారు. అంతకముందు పోలీసుల విచారణలో రాజాను చంపినట్లుగా నేరాన్ని అంగీకరించారు. తీరా కోర్టులో హాజరపరచగా ప్లేట్ ఫిరాయించారు. అయితే తమ దగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయంటూ పోలీసులు చెబుతున్నారు. ఇండోర్‌కు చెందిన రాజా రఘువంశీ–యూపీకి చెందిన సోనమ్ రఘువంశీకి మే 11న వివాహం జరిగింది. మే 20న హనీమూన్ కోసం మేఘాలయకు వెళ్లారు. మే 23న హంతక ముఠాతో కలిసి భార్య సోనమ్.. భర్తను చంపేసి లోయలో పడేసింది. ఈ కేసులో ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు. ఇందులో ఇద్దరిని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. తీరా చూస్తే నేరాన్ని అంగీకరించలేదు. షిల్లాంగ్ నగర పోలీసు సూపరింటెండెంట్, హత్య కేసును దర్యాప్తు చేస్తున్న అధికారి ఖార్కోంగోర్ మాట్లాడుతూ.. ఆకాష్ రాజ్‌పుత్, ఆనంద్ కుర్మి గురువారం మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచినప్పుడు మౌనంగా ఉన్నారని.. ఎటువంటి వ్యాఖ్యలు చేయడానికి నిరాకరించినట్లు తెలిపారు. ఐదుగురు నిందితు ల్లో ఇద్దరిని మాత్రమే మేజిస్ట్రేట్ ముందుకు తీసుకొచ్చినట్లు చెప్పారు. అయితే తమ దగ్గర అన్ని ఆధారాలు న్నాయని.. ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ నివేదిక కోసం ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. అయితే విచారణలో నిందితులంతా నేరాన్ని అంగీకరించారని.. కోర్టులో మాత్రం నిరాకరించారన్నారు. అయితే పోలీసుల వాదనను న్యాయస్థానం అంగీకరించ లేదని తెలిపింది. ఇక నేరాన్ని ఒప్పుకోకపో వడం అనేది నిందితుల హక్కు అని.. అందుకే భౌతిక ఆధారాలు ప్రవేశపెడతా మని చెప్పారు. దీంట్లో ఎలాంటి సమస్య లేదని. తగిన ఆధారాలు తమ దగ్గర ఉన్నట్లుగా చెప్పుకొచ్చారు. మే 11న రాజా–సోనమ్‌కు వివాహం జరిగింది. అయితే సోనమ్‌కు అప్పటికే ప్రియు డు రాజ్ కుష్వాహా ఉన్నాడు. పెళ్లయ్యాక కూడా రాజ్ కుష్వాహాతో సోనమ్ సంబంధాలు కొనసాగించింది. పెళ్లైన 3 రోజులకే ప్రియుడి దగ్గరకు వచ్చి.. భర్త రాజాను చంపేందుకు కుట్ర పన్నింది. మే 20న హనీమూన్ పేరుతో మేఘాలయకు తీసుకొచ్చి భర్తను చంపేసింది. ఈ కేసులో ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు. ఇక సోనమ్‌తో ఆమె కుటుంబ సభ్యులు బంధాలను తెంచుకున్నారు.

## అమెరికాతో అణు చర్చలు జరిపే ఉద్దేశం లేదు..

వాషింగ్టన్,అగ్రరాజ్యం అమెరికాతో ఎలాంటి అణు చర్చలు జరిపే ఉద్దేశం తమకు లేదని ఇరాన్ తేల్చి చెప్పింది. వచ్చే వారం టెహ్రాన్‌తో అణు చర్చలు జరగనున్నాయని యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రకటించాడు. అయితే, ట్రంప్ వ్యాఖ్యలను తాజాగా ఇరాన్ విదేశాంగ శాఖ మంత్రి అబ్బాస్ అరాగ్చీ తోసిపుచ్చారు. అమెరికాతో అణు ఒప్పందానికి సంబంధించి సమావేశం అయ్యే ఆలోచన మాకు లేదని వెల్లడించారు. ఇటీవల తమపై జరిగిన దాడులు తీవ్ర నష్టాన్ని కలిగించాయి.. ఇరాన్ అణు కార్యక్రమం పునరుద్ధరణపై అధికారులు రిసెర్చ్ చేస్తున్నారని అరగ్చీ చెప్పారు. ఈ చర్చలపై శ్వేతసౌధం ప్రెస్ సెక్రటరీ కరోలినా లీవిట్ మాట్లాడుతూ.. ప్రస్తుతానికి అలాంది ఏమీ లేదన్నారు. కానీ, ఒప్పందానికి సంబంధించిన చర్చలు జరపడానికి మధ్యవర్తిత్వం వహిస్తున్న ఖతార్‌తో మాట్లాడుతున్నామని చెప్పుకొచ్చారు. అయితే, హేగ్‌లో జరిగిన నాటో శిఖరాగ్ర సమావేశంలో డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ.. వచ్చే వారం ఇరాన్‌తో అణు చర్చలు జరిపే అవకాశం ఉందన్నారు. అణ్వాయుధాలు తయారు చేయాలన్న ఆశయాన్ని వదిలేసేలా టెహ్రాన్‌తో ఒప్పందం చేసుకుంటామని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఇరాన్ చమురుపై యూఎస్ ఆంక్షలు సడలించే ఛాన్స్ ఉందని ట్రంప్ తెలిపారు. ప్రస్తుతం ఇరాన్ పునర్ నిర్మాణానికి నగదు వనరులు కావాలని చెప్పుకొచ్చారు. ఈ క్రమంలోనే ఆ దేశం కోలుకోవడానికి సపోర్టు ఇవ్వడం కోసం కొన్ని ఆంక్షలను సడలిస్తామని పేర్కొన్నారు.



## రేవంత్ సర్కార్‌పై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ధ్వజం

హైదరాబాద్ : సీఎం రేవంత్ రెడ్డి సర్కార్‌పై బీఆర్ఎస్ సీనియర్ లీడర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ధ్వజమెత్తారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు విషయంలో దళితుల పట్ల చూపిస్తున్న వివక్షపై ఆర్ఎస్పీ మండిపడ్డారు. మంచిర్యాల జిల్లా భీమారం మండలం పోలంపల్లికి చెందిన నక్క సనా, వేణు దంపతులకు ఇందిరమ్మ ఇల్లు ప్రొసీడింగ్‌ను ఆపేసిన ఘటనపై ఆర్ఎస్పీ తీవ్రంగా స్పందించారు. అంటే మీ ఏఐ లాంగ్వేజ్ మోడల్‌లో వాట్సాప్‌లో బీఆర్ఎస్ స్టాటస్ పెట్టుకుంటే, ఎస్సీలైతే ఇందిరమ్మ ఇల్లు ఇవ్వనవసరం లేదని షరతులు విధించి ప్రోగ్రాం తయారు చేసింద్రన్న మాట! మరీ ఇంత చిల్లర పాలనా? అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ధ్వజమెత్తారు.




అసలేం జరిగిందంటే..?

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ పార్టీతోపాటు కేసీఆర్ ఫొటో వాట్సాప్ స్టేటస్ పెట్టినందుకు బుధవారం మంత్రి వివేక్ నిర్వహించే కార్యక్రమంలో తనకు ఇవ్వాల్సిన ఇందిరమ్మ ఇంటి ప్రొసీడింగ్‌ను ఆపేసినట్టు మంచిర్యాల జిల్లా భీమారం మండలం పోలంపల్లికి చెందిన నక్క సనా %–% వేణు దంపతులు ఆవేదన వ్యక్తంచేశారు. గురువారం ఉదయం పోలంపల్లిలోని తమ గుడిసె ముందు మాట్లాడారు. ఎస్సీ మాదిగ అయినందునే వివక్ష చూపి ఇందిరమ్మ ఇంటి ప్రొసీడింగ్ ఇవ్వలేదని ఆరోపించారు. ఈ విషయమై ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లి పంచాయతీ కార్యదర్శి సృజనను కలిస్తే.. మంత్రి పీఏ ప్రొసీడింగ్ ఆపేయమని చెప్పారని, బీఆర్ఎస్ స్టేటస్‌లు ఎందుకు పెడుతున్నారని పంచాయతీ కార్యదర్శి పేర్కొనడంతో వారు కంగుతిన్నారు. వాట్సాప్ స్టేటస్ పెట్టడం వల్లే మంత్రి పీఏకు ఫిర్యాదు వెళ్లిందని, అందుకే ప్రొసీడింగ్ ఇవ్వడం లేదని ఆమె తెలిపినట్టు వారు వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం అర్హులందరికీ ఇందిరమ్మ ఇవ్వాలని చెప్తున్నారని, ప్రజాపాలన అంటే ఇదేనా? అని వారు ప్రశ్నించారు. ప్రొసీడింగ్ ఇవ్వకపోతే ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు.

## రాహుల్‌గాంధీకి సవాల్ విసిరిన ప్రశాంత్ కిషోర్



పాట్నా:బీహార్‌లో పాలిటిక్స్ హీటెక్కుతున్నాయి. త్వరలోనే రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే అన్ని పార్టీలు సన్నద్ధమయ్యాయి. ప్రధాని మోడీ ప్రత్యేకంగా ఫోకస్ పెట్టి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇక ఇటీవల బీహార్‌లో అణు విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. తాజాగా జన్ సురాజ్ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్.. అధికార–ప్రధాన విపక్ష పార్టీలపై విమర్శలు గుప్పించారు. నితీష్ కుమార్–లాలూ ప్రసాద్ యాదవ్ పరిపాలనలో బీహార్‌ను కార్మికుల రాష్ట్రంగా మార్చారని ధ్వజమెత్తారు. గత 30–35 ఏళ్లుగా రాష్ట్రమంతా కార్మికుల రాష్ట్రంగా మారిందని పేర్కొన్నారు. ఇక్కడ బిడ్డల వీపుపై బస్తాలు మోయవలసి వస్తోందని ధ్వజమెత్తారు. ఇక ఒక ఇంటర్వ్యూలో ప్రశాంత్ కిషోర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అగ్ర నేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీపై ధ్వజమెత్తారు. రాబోయే బీహార్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి విజయావకాశాలు ఎలా ఉంటాయన్న ప్రశ్నకు సమాధానం ఇస్తూ గ్రాండ్ ఓల్డ్ పార్టీకి స్థానం లేదన్నారు. ఎన్ని ఓట్లు సాధిస్తుందో అంచనా వేయమని అడిగిన ప్రశ్నకు జవాబు ఇస్తూ.. లాలూ ఎన్ని సీట్లు ఇస్తే అంత అని చమత్కరించారు. ఈసారి పొత్తులతో కాకుండా సింగిల్‌గా పోటీ చేయాలని రాహుల్‌గాంధీకి ప్రశాంత్ కిషోర్ సవాల్ విసిరారు. రాహుల్‌గాంధీకి దమ్ము,ధైర్యం ఉంటే ఒంటరిగా పోటీ చేసి సీట్లు సాధించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు జేడీయూ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమికి..ఆర్జేడీ నేతృత్వంలోని ఇండియా కూటమికి సవాల్ విసిరారు. ఈ ఏడాది చివర్లో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. ఏదొక రోజున షెడ్యూల్ ప్రకటించే అవకాశం...

### సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ అధికారుల ఆరా

గణపురం,జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలో పలు రేషన్ డిపోలను సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. రేషన్ డిపోలు వివరాలను తెలుసుకుని, సరుకులను పరిశీలిస్తునారు. ఈ తనిఖీలు సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ డిప్యూటీ డైరెక్టర్ జై.ప్రకాష్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, అధికారులు తనిఖీలు చేపట్టారు.

బియ్యం పంపిణీ పై ఆరా..

ఈ సందర్భంగా సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ డిప్యూటీ డైరెక్టర్ జై ప్రకాష్, కమిటీ సభ్యులు మాట్లాడుతూ గణపురం షాప్ నెంబర్ మూడు రేషన్ డిపో తనిఖీ చేశామన్నారు. ప్రజలకు రేషన్ పంపిణీ చేస్తున్న విధానం, రేషన్ బియ్యం

## సంపాదకీయం

శనివారం 28-06-2025

# తొలగని ముప్పు!

సామ్రాజ్యవాదుల రక్తపిపాస, పెట్టుబడి లాభాపేక్ష లేకుండా మానవాళి చరిత్రలో జరిగే యుద్ధాలు దాదాపు అరుదు. ఈ యుద్ధ జ్వాలల్లో సామాన్యులే సమిధలవుతారు. ఇరాన్, ఇజ్రాయిల్ మధ్య చోటుచేసుకున్న తాజా దాడులు కూడా దీనికి మినహాయింపు కాదు. అమెరికా అండదండలతో ఇజ్రాయిల్ ప్రారంభించిన ఈ యుద్ధం ఇరాన్ ప్రతిస్పందనతో 12 రోజుల పాటు సాగింది. పరోక్ష సాయం నుండి అమెరికా ప్రత్యక్షంగా యుద్ధ రంగంలోకి దిగడంతో ప్రపంచమంతా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఏం జరుగుతుందోనన్న తీవ్ర ఉత్కంఠ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నోటి వెంట కాల్పుల విరమణ ప్రకటన వెలువడింది. ఆ ప్రకటనకు కొన్ని గంటల ముందు మధ్య ప్రాచ్యంలోని అమెరికా యుద్ధ స్థావరాలపై ఇరాన్ క్షిపణుల వర్షం కురిపించడం, అగ్ర రాజ్యాధినేత హుటాహుటిన సిట్యుయేషన్ రూమ్‌లోకి తరలి వెళ్లడం గమనార్హం. వారం రోజుల్లో ఇలా సిట్యుయేషన్ రూమ్‌లోకి ఆయన వెళ్లడం అది రెండవ సారి. మొదటి సారి వెళ్లినప్పుడు ఇరాన్‌పై అమెరికా ప్రత్యక్ష యుద్ధానికి దిగింది. బంకర్ బస్టర్ బాంబులతో ఇరాన్ అణు కేంద్రాలపై దాడికి దిగింది. అమెరికా స్థావరాలే లక్ష్యాలుగా మారిన తరువాత రెండవ సారి సిట్యుయేషన్ రూమ్‌లోకి వెళ్లిన ఆయన శాంతి మంత్రం పఠించారు. ఈ మధ్యలో ఏం జరిగిందో, అగ్రరాజ్య వైఖరిలో వచ్చిన ఈ మార్పుకు కారణం ఏమిటో ఎవరికి వారు ఊహించుకోవాల్సిందే! అయితే, పన్నెండు రోజుల పాటు సాగిన ఈ యుద్ధంలో అటు ఇరాన్‌లోనూ, ఇటు ఇజ్రాయిల్‌లోనూ వందలాదిమంది మరణించారు. స్వప్నాలు ఛిద్రమై, బతుకులు అస్తవ్యస్తమై రోడ్డున పడ్డ బాధితులు ఎందరో%ౌ%! ఇంత జరిగిన తరువాత కూడా మానవాళికి ముప్పు తొలగిందా అంటే లేదనే సమాధానం! సామ్రాజ్యవాదపు బరితెగింపే దీనికి కారణం. అణుబూచిని కారణంగా చూపి ఇజ్రాయిల్ ఇరాన్‌పై దాడులను ప్రారంభించింది. ఈ దాడులకు మద్దతిచ్చిన అమెరికా చివరకు ప్రత్యక్షంగానూ దాడులకు తెగబడింది. నిజానికి ఇరాన్ అణు ఆయుధ నిరోధక ఒప్పందం (ఎన్‌పిటి)పై సంతకం చేసిన దేశం. అంతర్జాతీయ తనిఖీలను కూడా అంగీకరించిన దేశం. అంతేకాదు, ఐదు అణ్వాయుధ దేశాలతో పాటు జర్మనీతో కలిపి (పి5ం1) సంయుక్త సమగ్ర కార్యాచరణకు ఒప్పందం కూడా కుదుర్చుకుంది. ఒకరిపై ఒకరు అణు దాడులు చేసుకోకూడదని, అణు సామర్ధ్యాన్ని శాంతియుత కార్యక్రమాలకు మాత్రమే వినియోగించుకోవాలన్నది ఈ ఒప్పంద సారాంశం. ట్రంప్ తొలి విడత పాలనలో ఈ ఒప్పందం నుండి అమెరికా బయటకు వచ్చేసింది. అదే సమయంలో ఇజ్రాయిల్‌కు పూర్తిస్థాయిలో అండగా నిలిచింది. ఇజ్రాయిల్ కూడా అణ్వాయుధాలు తయారు చేస్తున్నప్పటికీ ఎన్‌పిటిపై సంతకం చేయలేదు. తన అణ్వాయుధాల గుట్టును వెల్లడించలేదు. అమెరికా అండతో చెలరేగిపోతోంది. 2023 అక్టోబర్ నుండి ఇప్పటి వరకు ఇజ్రాయిల్ మధ్య ప్రాచ్యంలోని వివిధ దేశాలపై 42 వేల దాడులు చేసినట్లు ఒక అధ్యయనం వెల్లడించింది. పాలస్తీనా, లెబనాన్, సిరియా, ఇరాన్, యెమన్‌లపై సాగిన ఈ దాడుల్లో 55 వేల మంది మరణించారు. ఇలా ప్రాణాలు కోల్పోయిన వారిలో పాలస్తీనాకు చెందిన వారే 50 వేల మందికి పైగా ఉన్నారు. సామ్రాజ్యవాద రక్కసి నెత్తుటి దాహాన్ని అర్ధం చేసుకోవడానికి ఈ గణాంకాలు చాలు కదా!అమెరికా, ఇజ్రాయిల్ దాడుల తరువాత కూడా తన అణు సామర్థ్యం చెక్కు చెదరలేదని, ఆ రంగంలో తన కృషిని కొనసాగిస్తానని ఇరాన్ ప్రకటించింది. అమెరికా సాయంతోనే చెలరేగుతున్న ఉక్రెయిన్‌తో యుద్ధంలో మునిగి ఉన్న రష్యా తనపై నాటో దేశాలు దాడి చేస్తే ప్రతిగా అణ్వాయుధాలను ప్రయోగించడం మినహా మరో మార్గం లేదని ఇప్పటికే ప్రకటించింది. ఈ ప్రకటన తరువాత కూడా ఉక్రెయిన్‌కు సాయాన్ని అందించడంతో పాటు, నాటో దేశాలపై అమెరికా ఒత్తిడి కొనసాగుతోంది. అమెరికాతో సహా అనేక దేశాలు సంక్షోభంలో చిక్కుకుంటున్నాయి. వరుసగా చోటుచేసుకుంటున్న ఈ పరిణామాలు పొంచి వున్న ముప్పునే సూచిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ సుహృద్భావాన్ని పెంపొందించేందుకు కృషి ప్రారంభం కావాలి. అణ్వాయుధ నిరోధక ఒప్పందాన్ని చిత్తశుద్ధితో అమలు చేయాలి. లేని పక్షంలో ప్రపంచం మరో పెను ముప్పును ఎదుర్కోక తప్పదు.

# గద్దర్ అవార్డుల్లో ఏదీ పారదర్శకత?

హైదరాబాద్,ఇటీవల జరిగిన 'తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డ్' కార్యక్రమం ఒక విషయం స్పష్టంగా చూపింది. గద్దర్ పేరుతో అన్నీ విభాగాల అవార్డులకూ పేర్లు పెట్టడం ఘోరమైన పొరపాటు. గద్దర్ విప్లవాత్మక ఆలోచనలకు విరుద్ధమైన చిత్రాలకు అవార్డులు ఇస్తే, అది గద్దర్ వారసత్వాన్ని అవమానించడమే కాక, ఆయనను స్మరించడంలో ఉండే సారాన్ని మసకబార్చేపనిగా మారుతుంది. పలుమార్లు హెచ్చరికలివ్వబడినప్పటికీ ప్రజాభిప్రాయాన్ని తృణప్రాయంగా పట్టించుకోకుండా ప్రభుత్వం ముందుకు పోయింది. జ్యూరీ ఎంపికనుండి అవార్డుల నిర్ణయాల వరకూ ఈ కార్యక్రమమంతా తెలంగాణ ప్రజలను తీవ్రంగా నిరాశపరిచింది. ఈ ప్రక్రియ అంతా పారదర్శకతలేకుండా, అనేక విరుద్ధతలతో నిండినదిగా ఉంది. దీనిని సమీక్షించకుండా వదిలేస్తే, ఇది రాష్ట్ర సాంస్కృతిక రంగంలో శాశ్వత మచ్చగా మిగిలిపోతుంది.అంతేకాదు, ఇది బాధ్యత వహించేవారి సామర్థ్యం, నైతికతలపై కూడా తీవ్రమైన సందేహాలు కలిగిస్తోంది. ఉదాహరణకు, పుష్పా 2 చిత్రంలోని స్మగ్లర్ పాత్రకు అవార్డు ఇచ్చారు. ఈ సినిమాలో అసభ్యతలు, పోలీసుల్ని దూషించే ఘట్టాలు ఉన్నాయి. దీనిద్వారా మన యువతకు ఏ సందేశం ఇస్తున్నాం? ఏ విలువలు మిగులుస్తున్నాం? ఇది అక్రమతను, అసభ్యతను, చట్టవ్యతిరేకతను ప్రోత్సహించడమే కదా? ఇది గద్దర్ పేరుతో జరగాల్సిన కార్యక్రమమా? ఇంకో తీవ్రమైన విషయమేమిటంటే - రజాకార్ అనే సినిమాకు రాష్ట్ర అవార్డు ఇవ్వడం. ఈ చిత్రం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించిందని, మత విద్వేషాలను ప్రేరేపించేలా ఉన్నదని చరిత్రకారులు, రచయితలు విమర్శించారు. అలాంటి సినిమాకి చారిత్రక చిత్రం విభాగంలో అవార్డు ఇవ్వడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం వక్రీకృత చరిత్రను సమర్థించినట్లైంది. ఇది గద్దర్ లాంటి విప్లవాత్మక నాయకుడి పేరుతో జరిగిందంటే, అది మరింత దురదృష్టకరం. తాము సెక్యులర్ విలువలకు కట్టుబడి ఉన్నామని చెప్పుకునే పార్టీకే ఇది చారిత్రక అపసవ్యంగా నిలుస్తుంది.అవార్డు కమిటీ సభ్యులలో ఒకరైన గేయ రచయిత 'షామ్' కూడా అదే సినిమాకు పనిచేయడం మరొక పెద్ద నైతిక ఉల్లంఘన. జ్యూరీగా పనిచేస్తూ, తనకు సంబంధించిన సినిమాకు పురస్కారం రావడం ద్వారా ఆ ప్రక్రియకు విశ్వసనీయతే మిగలదు. ఇంకో ఉదాహరణ అవార్డు కార్యక్రమానికి ఒకరోజు ముందు, తెలంగాణ మంత్రివర్గ సభ్యుని సోదరుడైన పొన్నం రవిచంద్రను ఉత్తమ విమర్శకుడిగా ప్రకటించడం. అసలు ఆ విభాగానికి ముందుగా ఏ దరఖాస్తులూ లేవని ప్రకటించారు. మరి ఒక రోజులోనే ఆయన పేరు ఎలా వచ్చిందీ? ఇది అవార్డు నిబంధనలకు, విధివిధానాలకు విరుద్ధమే కాక, అవార్డులు ఎలా యాదృచ్ఛికంగా నిశ్చయించబడుతున్నాయన్నదానికి ఉదాహరణ. అలాగే, ఉర్దూ సినిమాలకోసం సరైన జ్యూరీని ఏర్పాటు చేయలేదన్నది మరొక ప్రధాన సమస్య. గత పదేళ్లలో ఒక్క ఉర్దూ సినిమాకూ అవార్డు ప్రకటించలేదు ఎందుకు?. ఉర్దూ భాషా పరిజ్ఞానం లేని జ్యూరీతో ఎలా న్యాయం జరుగుతుంది?. ఇవన్నీ కాకుండా, అసలు అవార్డు ప్రక్రియనే అవగాహనారాహిత్యంగా మొదలయింది. పద్మ అవార్డులు, జాతీయ ఫిలిం అవార్డులు, అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్స్ అన్నీ స్పష్టమైన దరఖాస్తుల పద్ధతిలో, పారదర్శకంగా నిర్వహించబడతాయి.కానీ తెలంగాణ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన మాత్రం 2024లో సెన్సార్ అయిన చిత్రాలకే దరఖాస్తులు ఆహ్వానించింది. గత పదేళ్లలో(జూన్ 2, 2014 నుంచి డిసెంబర్ 31, 2023 వరకు) వచ్చిన సినిమాలకైతే దరఖాస్తే తీసుకోలేదు. అలాంటప్పుడు సెన్సార్ అయిన సినిమాలన్నీ చూసి నిర్ణయించవలసి ఉంటుంది. ఇంకో ఆందోళన కలిగించే విషయం 2014నుండి 2023 వరకు అవార్డులు కేవలం నిర్మాతలకే ఇవ్వబడ్డాయి. అసలు సినిమాలు చూసే పనే చేయలేదు. ఆ సినిమాల




కళాకారులు, సాంకేతిక నిపుణుల్ని పూర్తిగా పక్కనపెట్టారు. టిఎఫ్‌డిసి ఛైర్మన్ స్వయంగా నిర్మాత కావడం ఈ ప్రక్రియను మరింత అనుమానాస్పదంగా చేస్తుంది. ఇది అసలు కళను గౌరవించడం కాదు పెట్టుబడిదారుల్ని ప్రోత్సహించే వ్యవస్థగా మారిపోయింది. ప్రజాధనం, కళా ప్రేరణకు వాడాలి కానీ, లోపాయికారి వర్గాలకు లబ్ధి చేకూర్చటానికి కాదు. ఇంకా, టిఎఫ్‌డిసి ఛైర్మన్‌కు సంబంధిత నాలుగు చిత్రాలు (శతమానం భవతి, మహర్షి, ఫిదా, బలగం) అవార్డులకు ఎంపికవడం, వాటిలో రెండింటిలో జ్యూరీ హెడ్ జయసుధ నటించడమూ తగిన విధాన ఉల్లంఘనలే. అసలు అధికారిక జ్యూరీ ఉన్నా, ఎందుకు మరో జ్యూరీ వేసారు? ఆ కొత్త జ్యూరీ సినిమాలు చూసిందా? నిబంధనల ప్రకారం టిఎఫ్‌డిసి అధికారులకు సంబంధిత సినిమాలను అవార్డుల పోటీలో అర్హత కలిగించకూడదు. ఇది నిబంధనల ఉల్లంఘనే!.ఇంకా చాలా మంచి సినిమాలు, ముఖ్యంగా తెలంగాణ సినిమాలు పూర్తిగా విస్మరించబడ్డాయి. 15 -20 రోజుల్లోనే అన్ని సినిమాలు చూడడం అసాధ్యం. ఇది పూర్వనిర్దేశిత పక్షపాతంతో కూడిన వ్యవస్థ అని చెప్పక తప్పదు. అలాగే షార్ట్ ఫిలిం విభాగానికి దరఖాస్తులు తీసుకున్నా, అవార్డులు ఎవరికి ఇచ్చారో వేడుకలో ప్రకటించలేదు. ఇది మరీ అన్యాయం! తొందరపడి, జనం మనసు గెలవాలనే ఉద్దేశంతో చేసిన ఈ వేడుక, ఖర్చులన్నీ ప్రజాధనంతో నిర్వహించినా, విశ్వసనీయతను కోల్పోయింది. ప్రజల ప్రశంసకన్నా వ్యతిరేకతే ఎక్కువగా ఎదుర్కొంది. మంచి మార్గం ఏమిటంటే మొదటగా తెలంగాణ ఫిలిం పాలసీని ఏర్పాటు చేయాలి. గద్దర్ ఆశయాలకు అనుగుణంగా ఉన్న చిత్రాలను ప్రోత్సహించాలి. అప్పుడు ఇచ్చే అవార్డులు నిజమైన గౌరవంగా నిలుస్తాయి. ప్రస్తుతంగా ఎంపిక చేసిన ఏ సినిమా గద్దర్ ఆలోచనలతో సంబంధం లేదు. మరి, ఈ విధంగా ఈ సినిమాల ఎంపికను ఎలా ఆయనకు నివాళిగా చెప్పగలం? కాబట్టి, ఈ వ్యవస్థ పట్ల విశ్వాసాన్ని తిరిగి పొందడానికి, గద్దర్ గౌరవాన్ని కాపాడటానికి ఈ సూచనలు అమలు చేయాలి: 2014 జూన్ 2 నుంచి 2023 డిసెంబర్ 31 మధ్య విడుదలైన సినిమాల కోసం తక్షణమే టిఎఫ్‌డిసి దరఖాస్తులను ఆహ్వానించాలి. కొత్త, స్వతంత్ర జ్యూరీని సినీ దర్శకులు, రచయితలు, విమర్శకులు, సీనియర్ మేధావులతో నియమించాలి. ఆ దశాబ్దపు సినిమాలన్నీ, అలాగే 2024 దరఖాస్తు చేసిన సినిమాలు పారదర్శకంగా మళ్లీ కొత్త జ్యూరీ చూడాలి. చూసి, నాణ్యత, సాంస్కృతిక విలువల ఆధారంగా అవార్డులు ఇవ్వాలి. ఈ విమర్శను దాడిగా కాకుండా, రాష్ట్రం, తెలంగాణ కళాసంస్కృతి పట్ల మమకారంతో చెప్పిన విజ్ఞప్తిగా స్వీకరించాలి. నేను ఒక చిత్రదర్శకుడిగా, తెలంగాణ ప్రజాస్వామ్య పరిరక్షకుడిగా, ఈ రాష్ట్ర కళావారసత్వం, ప్రతిష్ఠను నిలబెట్టాలనే ధ్యేయంతో సూచిస్తున్నాను.

# ఖమ్మం జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఎవరంటే?




ఖమ్మం,ఆ జిల్లా డీసీసీ పీఠంకోసం పలువురు ఆశావాహులు ఆశగా ఎదురు చూస్తున్నారట ప్రస్తుతం అధ్యక్షులుగా ఉన్న నాయకుడు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదవి కావాలని పట్టుపడుతున్నాడని పార్టీ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది. ఇక ఓ మంత్రి అనుచరులు ఇద్దరు తమకు డీసీసీ పదవి ఇప్పించాలని ఆయన్ను కోరుతు న్నారట. మరో పక్క మాజీ కేంద్ర మంత్రి,రాజ్యసభ సభ్యురాలు కూడా తమ వర్గం వారికే ఇవ్వాలని పట్టుబడుతున్నారట. ఇంతలా ఆ పదవి కోసం పోటీప డుతున్న జిల్లా ఏది? ఎవరా నేతలు?

కాంగ్రెస్‌కు కంచుకోటగా ఖమ్మం జిల్లా

ఖమ్మం జిలకాంగ్రెస్ పార్టీకి మొదటి నుంచి గట్టిపట్టున్న ప్రాంతమని కాంగ్రెస్ వర్గాలు బలంగా నమ్ముతున్నాయి. స్వరాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి అంతకు ముందు కూడా కాంగ్రెస్ కంచుకోటగా ఖమ్మం జిల్లాకు నిలిచింది. గతంలో బీఆర్ఎస్ పార్టీ పదేళ్ళు పాటు అధికారంలో ఉన్నా%ౌ% ఇక్కడ ప్రతి సారీ ఒక్క ఎమ్మెల్యేతోనే సరిపెట్టుకుంది. గతంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన ఎనిమిది మంది ఎమ్మెల్యేలను బీఆర్ఎస్ చేర్చుకున్నా, పార్టీ క్యాడర్ పెద్దగా చెక్కు చెదరలేదనే చర్చ ఉంది. అందుకే మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఖమ్మం జిల్లాలోని ఐదు స్థానాల్లో ఐదుకు ఐదు.. భారీ మెజారిటీతో గెలుపొందడం వెనక పార్టీ నేతలు, కార్యకర్తల కృషి అమోఘమని చెప్పవచ్చు.

పార్టీ క్యాడర్‌కు వెన్నుదన్నుగా నిలిచిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గడిచిన పదేళ్ళుగా కాంగ్రెస్ పార్టీకీ అధికారం లేక అచేతనంలో ఉన్న కాలంలో ప్రస్తుత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పార్టీ క్యాడర్‌కు వెన్నుదన్నుగా నిలుస్తూ వచ్చారు. పార్టీ అభివృద్ధి కోసం శ్రమించారు. ఆయన ప్రధాన అనుచరుడిగా ఉన్న పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్ సైతం పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు డీసీసీ పదవి సమర్థవంతంగా చేపట్టి గ్రామాల్లో కిందిస్థాయి కార్యకర్తలకు మనోధైర్యాన్ని నింపడంలో సఫలమయ్యారు. నిత్యం భట్టి సూచనలతో పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ పార్టీ కార్యాలయం వేదికగా ఆనాటి ప్రభుత్వ పనితీరును ఎండగట్టేవారు. బీఆర్ఎస్ పార్టీ నేతలు కాంగ్రెస్ పార్టీ నేతలపై తప్పుడు కేసులు పెట్టి ఆర్థికంగాను, మానసికంగాను ఇబ్బందులకు గురిచేసినా.. వాటన్నింటిని తట్టుకొని ఎన్నికల్లో గెలిపే లక్ష్యంగా కింది స్థాయి కేడర్‌ను పటిష్టం చేసే ఉండేవారు. భట్టి సూచనలతో జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్ వ్యూహాలు ఫలించాయట.. ఫలితంగానే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 8 సీట్లు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుందంటారు.

రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదవి..

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో తనకు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదవి, లేదా ఖమ్మం సూడా ఛైర్మన్ పదవిలో ఎదో ఒకటి ఇవ్వాలని భట్టి విక్రమార్కను గట్టిగానే కోరుతున్నారట ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్. అయితే ప్రస్తుత పరిస్థితిలో ఆ రెండు పదవులు ఇచ్చే పరిస్థితి లేదని డిప్యూటీ సీఎం భట్టి పువ్వాళ్ళను సముదాస్తూ వస్తున్నారని టాక్. ఇటీవల ఏఐసిసి అగ్రనేత రాహుల్ గాంధీ జిల్లాల్లో పార్టీ అధ్యక్షులే కిరోల్ అని చెప్పడంతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాత్రం ప్రస్తుతం జిల్లా అధ్యక్షుడు గా ఉన్న దుర్గాప్రసాద్ నే కొనసాగాలని కోరుతున్నారట.సముచిత స్థానం ఇప్పించాలని కోరుతున్న పొంగులేటి ఇద్దరు అనుచరులుఇక ఇదిలా ఉంటే జిల్లాకు చెందిన మరో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అనుచరులు ఇద్దరు తమకు సముచిత స్థానం ఉండె పోస్టు ఇప్పించాలని కోరుతున్నారట. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఆయనను డిమాండ్ చేస్తున్నారట. వారిలో ఒకరు వైరా నియోజకవర్గానికి చెందిన బీసీ సామాజికవర్గ నేత, మరొకరు ఎస్సీ కేటగిరికి చెందిన వ్యక్తిగా ఉన్నారని సమాచారం. వీరిద్దరూ మంత్రి పొంగులేటికి ప్రధాన అనుచరులు కావడం విశేషం. ఆ ఇద్దరు నేతలు జిల్లాలో బలమైన నేతలుగా ముద్ర పడినవారే కావటంతో.. వారు కూడా జిల్లా డీసీసీ పదవి ఇప్పించాలని మంత్రిని కోరుతున్నారట.న అనుచరులకు జిల్లా అధ్యక్ష పదవి కట్టబెట్టేందుకు రేణుక చౌదరి వ్యూహాలు వీరే కాక ఖమ్మం ఆడబిడ్డగా చెప్పుకునే ఫైర్ బ్రాండ్, మాజీ కేంద్ర మంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరి కూడా తన అనుచరులకు జిల్లా అధ్యక్ష పదవి కట్టబెట్టేందుకు పావులు కదుపుతున్నారట. పాలేరు నియోజకవర్గంలో పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు జెడ్పీటీసీగా గెలిచి పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తున్న%ౌ% జడ్పీటిసి రాష్ట్ర సంఘం మాజీ అధ్యకులు కూడా తనకు సముచిత స్థానం కల్పించాలని కోరుతున్నారట. అంతేకాదు మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కూడా తనకు పార్టీలో సముచిత స్థానం కావాలని పార్టీ పెద్దలను కోరుతున్నారట వీరికి గ్రామీణ ప్రాంతాల్లో, మండలాల్లో ఎదుర్కొంటున్న సమస్యలపై పూర్తిస్థాయిలో అవగాహనతో పాటు కార్యకర్తలతో మంచి ఫాలోయింగ్ ఉందనే చర్చ ఉంది. అంతేకాదు గత పాలకుల పనితీరును ఎండగట్టే సందర్భాలలో గలమెత్తి నినదించారనే టాక్ లేకపోలేదు. అందుకే డీసీసీ పదవి ఇవ్వాలని ఆశిస్తున్నారు ఈ నేతలు.

ఖమ్మం జిల్లా డీసీసీ అధ్యక్ష పీఠంపై భారీగానే నేతల ఆశలు

ఇలా పలువురు నేతలు ఖమ్మం జిల్లా డీసీసీ అధ్యక్ష పీఠంపై భారీగానే ఆశలు పెట్టుకున్నారు. తమకు మంత్రులతో ఉన్న సాన్నిహిత్యాన్ని ఉపయోగించకోని ఖమ్మం జిల్లా పార్టీ, అధ్యక్ష పదవి కోసం ఎవరికి వారే గట్టిగానే ప్రయత్నాలు చేస్తున్నారట. ఇలా ఎవరి ఆశలు వారికి ఉన్నాయి. తమ అనుచరులకే పగ్గాలు ఇప్పించాలని అటు మంత్రులు, పార్టీ పెద్దలు పావులు కదుపుతున్నారు. మరి పార్టీ అధిష్టానం ఎవరిని డిసిసి అధ్యక్షునిగా ఎంపిక చేస్తుందనేది ఇప్పుడు ఇంట్రెస్టింగ్‌గా మారింది. అదే సమయంలో పార్టీ అధిష్టానం తీసుకునే నిర్ణయంతో ఎవరి మనసు నొచ్చుకొకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

## నగరంలో ఆషాడ బోనాల సందడి

హైదరాబాద్,ఆషాఢ మాసం బోనాలు భాగ్యనగరంలో ప్రారంభమయ్యాయి. చారిత్రాత్మక గోల్కొండ కోటపై వెలిసిన జగదాంబిక ఎల్లమ్మ ఆలయంలో తొలి బోనంతో బోనాల సందడి ప్రారంభమైంది. తెలంగాణ సంస్కృతికి, అస్తిత్వానికి ప్రతీకగా నిలిచే బోనాల పండుగ సందర్భంగా నగరంలో సందడి మొదలయ్యింది.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో వెలుగులోకి కొత్త విషయాలు

హైదరాబాద్, ఫోన్ ట్యాపింగ్ కేసులో రోజురోజుకు కొత్త విషయాలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. తాజాగా 2023 నవంబర్ 15 నుంచి నవంబర్ 30 వరకు భారీగా ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు అధికారులు నిర్ధారించారు. ఏకంగా 4013 ఫోన్ నెంబర్లను ట్యాపింగ్ చేసినట్లుగా ప్రణీత్ రావు అండ్ టీమ్ అంగీకరించారు. అందులో 618 మంది పొలిటికల్ లీడర్ల ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు తెలుస్తోంది. 618 మందిలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ఐఏఎస్, ఐపీఎస్ , పారిశ్రామిక వేత్తలు, జర్నలిస్టులు ఉన్నారు. రేవంత్ రెడ్డి ఆయన కుటుంబ సభ్యులు, బండి సంజయ్ ఆయన కుటుంబ సభ్యులు, ఈటెల రాజేందర్ ఆయన కుటుంబ సభ్యులు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆయన కుటుంబ సభ్యులతో పాటు అనుచరుల ఫోన్లు కూడా ట్యాప్ చేసినట్లు గుర్తించారు. త్వరలో కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మైనంపల్లి హనుమంత్ రావు, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం , మర్రి శశిధర్ రెడ్డి, బీఆర్ఎస్ నేతలు మాజీ ఎమ్మెల్యేలు పద్మా దేవేందర్ రెడ్డి , మర్రి జనార్ధన్ రెడ్డి, తాటి కొండ రాజయ్యలకు సిట్ నోటీసు ఇవ్వనుంది. ఐఏఎస్‌లు రోనాల్డ్ రాస్, గౌతంల ఫోన్లు కూడా ట్యాపింగ్ అయ్యాయి. మొత్తం 618 మంది స్టేట్‌మెంట్లను కూడా పోలీసులు రికార్డ్ చేయనున్నారు. ఇప్పటి వరకు 228 మంది స్టేట్‌మెంట్ రికార్డింగ్‌లు పూర్తి అయ్యాయి. ఇప్పటి వరకు కేవలం 2023 నవంబర్ నెలకు సంబంధించిన ఫోన్ ట్యాపింగ్ డాటా మాత్రమే విచారణ అధికారుల వద్ద ఉంది. మిగిలిన డాటా మొత్తం కూడా ధ్వంసం అయిన విషయం తెలిసిందే. 618 మంది ఫోన్ల ట్యాపింగ్‌కు సంబంధించి ఆధారాలను బట్టి ఇప్పటి వరకు 228 మంది స్టేట్‌మెంట్లను రికార్డు చేయగా.. మరికొంత మంది స్టేట్‌మెంట్లను కూడా రికార్డు చేయనుంది సిట్. ఇంతటి సంచలనమైన కేసును సీబీఐకు అప్పగించాలని, సీబీఐ విచారణలోనే అసలు వాస్తవాలు బయటకు వస్తాయని బీజేపీ డిమాండ్ చేస్తోంది. ఈ కేసులో ఎవరి పాత్ర ఉన్నా వదిలిపెట్టేది లేదని, విచారణలో ఎవరి ప్రమేయం ఉన్నా అరెస్ట్ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. అయితే ఇప్పటి వరకు అధికారుల వరకు మాత్రమే విచారణ, అరెస్టులు జరుగగా.. అధికారుల వెనక ఉన్న అప్పటి బీఆర్ఎస్ నేతలు ఎవరనేది మాత్రం దర్యాప్తులో వెల్లడి కావాల్సి ఉంది. మరోవైపు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి, డీసీసీ లీగల్ సెల్ ఛైర్మెన్ దేవరాజు గౌడ్‌కు సిట్ బృందం నుంచి ఫోన్ వచ్చింది. దీంతో ఈరోజు బుధవారం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో గడ్డం చంద్రశేఖర్ రెడ్డి, ఆయన పీఏ కరుణాకర్ రెడ్డి, డ్రైవర్ అశోక్, కాంగ్రెస్ నాయకులు అరవింద్ సిట్ ముందు వాంగ్మూలం ఇవ్వనున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో అప్పటి సీఎం కేసీఆర్, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి కామారెడ్డి నుంచి పోటీ చేసిన విషయం తెలిసిందే. సీఎం రేవంత్ సోదరుడు కొండల్ రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారంలో గడ్డం చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. ఎన్నికల సమయంలో పలుమార్లు గడ్డం చంద్రశేఖర్ రెడ్డి ఇంటిపై పోలీసుల రైడింగ్ కూడా జరిగింది.

# భారత్ ఆయుధ సంపత్తి పెరుగుతోంది

ఇస్లామాబాద్, భారతదేశం మరోసారి పాకిస్థాన్‌పై దాడి చేయవచ్చని నేషనల్ అసెంబ్లీలో పాక్ విపక్ష నేత ఒమర్ అయూబ్ ఖాన్ ఆందోళన వ్యక్తం చేశారు. భారత్ ఇటీవల ఆయుధాలను అభివృద్ధి చేసుకుంటూ వెళ్తుండటాన్ని ఆయన ప్రస్తావిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇండియా మిలటరీ సామర్థ్యంతో పోల్చుకుంటే పాక్ చాలా వెనకబడిందని ప్రధాని షెహబాజ్ షరీఫ్ నాయకత్వంపై విమర్శలు గుప్పించారు. రక్షణ సామర్థ్యాన్ని భారతదేశం విస్తరించుకుంటూ పోతోందని, ఇందువల్ల పాకిస్థాన్ జాతీయ భద్రతకు తీవ్ర ముప్పు ఏర్పడవచ్చని హెచ్చరించారు. భారతదేశం అధునాతన ఆయుధాలు, మందుగుండు సామగ్రిపై దూకుడుగా పెట్టుబడులు పెడుతూ దేశ రక్షణ సామర్థ్యాన్ని అసాధారణ స్థాయికి తీసుకువెళ్తోందని పాకిస్థాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ నేత ఒమర్ అయూబ్ అన్నారు. ఇదే వేగంతో వ్యవహరించడంలో పాకిస్థాన్ విఫలమవుతోందని, ఇందువల్ల వ్యూహాత్మక అసమతుల్యత కనిపిస్తోందని అన్నారు. భారతదేశ మోడ్రనైజేషన్ డ్రైవ్‌తో పోల్చినప్పుడు పాక్ ఎక్కడా కనిపించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇండియా తమ రక్షణ బడ్జెట్‌ను పెంచుకుంటూ పోతోందని, మిలటరీ ప్రొక్యూర్‌మెంట్ వేగంగా సాగుతుండటం ఇస్లామాబాద్‌లోని పాలసీమేకర్లకు ఆందోళన కలిగిస్తోందని అయూబ్ అన్నారు. ముఖ్యంగా ద్వైపాక్షిక సంబంధాలు ఇబ్బందుల్లో పడటం, సరిహద్దు ప్రాంతీయ అస్థిరత నేపథ్యంలో ఈ ఆందోళనలను మరింత పెంచుతున్నాయని పేర్కొన్నారు. షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం దేశ భద్రతా అవసరాలను పట్టించుకునే బదులు బుజ్జగింపు దౌత్యానికి పాల్పడుతోందని విమర్శించారు.

విద్యార్థినుల పట్ల అసభ్య ప్రవర్తన

సిమ్లా,24మంది విద్యార్థినులను వేధించిన ప్రభుత్వ ఉపాధ్యాయుడిని పోక్సో చట్టం కింద అరెస్ట్ చేసినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. ఆ ఉపాధ్యాయుడుని విధుల నుండి తొలగించడంతో పాటు మూడు రోజుల పాటు కస్టడీ విధించినట్లు వెల్లడించారు. హిమాచల్ ప్రదేశ్‌లో సిర్మౌర్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో నిందితుడు గణితశాస్త్రం బోధిస్తున్నాడు. 8వ తరగతి నుండి పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఉపాధ్యాయుని వేధింపుల గురించి పాఠశాల ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేశారు. ఉపాధ్యాయుడు తమను అనుచితంగా తాకాడని 24 మంది విద్యార్థులు ప్రిన్సిపల్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై విద్యార్థుల తల్లిదండ్రులను ఒక సమావేశానికి పిలిపించారు. వారిలో చాలామందికి తమ పిల్లలు ఎదుర్కొంటున్న వేధింపుల గురించి తెలియదని తేలింది. అనంతరం పాఠశాల అధికారులు ఈ ఫిర్యాదును పాఠశాల లైంగిక వేధింపుల నిరోధక కమిటీకి పంపారు. పోలీసులకు సమాచారం అందించడంతో వారు అతనిని అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం సాయంత్రం నిందితుడిని కోర్టులో హాజరుపరచగా మూడు రోజుల కస్టడీ విధించినట్లు తెలిపారు. విద్యాశాఖ సైతం వెంటనే స్పందించిందని, నిందితుడుని తక్షణమే సస్పెండ్ చేసిందని అధికారులు తెలిపారు. 'తీవ్రమైన,సున్నితమైన సమస్య'గా పేర్కొంటూ పాఠశాల డైరెక్టర్.. ఈ ఘటనపై వెంటనే విచారణ జరపాలని డిప్యూటీ డైరెక్టర్‌ను ఆదేశించారు.

## నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ సాగర్ మాల

న్యూఢిల్లీ,భారతదేశపు మొట్టమొదటి నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ సాగర్ మాల ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ ను కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్ శాఖా మంత్రి సర్బానంద సోనోవాల్ గురువారం ప్రారంభించారు. ఇది సముద్ర రంగంలో భారతదేశపు మొట్టమొదటి నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ. గతంలో సాగరమాల డెవలప్‌మెంట్ కంపెనీ లిమిటెడ్‌గా ఉన్న ఈ సంస్థ ఇప్పుడు అమృత్ కాల్ విజన్ 2047కి అనుగుణంగా ముందుకు సాగుతోంది. ఇది దేశ సముద్ర మౌలిక సదుపాయాల కల్పన, వాటి అభివృద్ధిలో కీలక భూమిక పోషిస్తోంది. ఇదో మినీ రత్న కంపెనీ. కేటగిరీ-ఎలో ఉన్న ఈ సెంట్రల్ పబ్లిక్ సెక్టార్ ఎంటర్‌ప్రైజ్‌ను జూన్ 19న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాఅధికారికంగా నాన్-బ్యాంకింగ్గ ÷నాన్షియల్ కంపెనీగా గుర్తించింది. మన ఆర్థిక వ్యవస్థలో

# విభజన చట్టం మేరకు పెరగని అసెంబ్లీ సీట్లు

న్యూఢిల్లీ,ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 ప్రకారం.. ఏపీ శాసనసభ స్థానాలను 175 నుంచి 225కు, తెలంగాణ అసెంబ్లీ స్థానాలను 119 నుంచి 153కు పెంచాల్సి ఉంది. ఈ మేరకు అప్పటి మన్మోహన్ సింగ్ ప్రభుత్వం హామీ కూడా ఇచ్చింది. అయితే విభజన హామీలన్నీ గాలికి పోయాయి.ఈ క్రమంలో ఇప్పుడు నియోజకవర్గాల పునర్విభజన కమిషన్ విభజన చట్టాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉన్నది. దీనిపైనా చంద్రబాబు ఒత్తిడి చేసే అవకాశం లేకపోలేదు. అయితే జనాభా గణన జరిగే వరకు వేచి చూస్తారని అంటున్నారు. జనభా లెక్కలు తేలాక ఎలాంటూ డీ లిమిటేషన్ జరగవచ్చని అంటున్నారు. నియోజకవర్గాల పునర్విభజన సమగ్రంగా జరగాలంటే జనాభాతో పాటు అభివృద్ధి సూచికలు, ప్రాంతాల సరిహద్దులను కూడా తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలి. నియోజక వర్గాల పునర్విభజన చేస్తే అన్ని ప్రాంతాలు, వర్గాల అభిప్రాయాలు తీసుకుంటే మంచిది. అయితే జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తే తమకు అన్యాయం జరుగుతుందని దక్షిణాది రాష్ట్రాలు గగ్గోలు పెడుతు న్నాయి. 1973లో వివిధ రాష్ట్రాలకు ఏ నిష్పత్తి ప్రకారం సీట్లను కేటాయించారో ఆ విధంగానే ఇప్పుడు కూడా అలాంటి నియమాలు, నిబంధనలను పాటించాలని కోరుకుంటున్నాయి. ఒకవేళ లోక్‌సభ సీట్లు పెంచాల్సివచ్చినా అదే నిష్పత్తితో అన్ని రాష్ట్రాలకు సమంగా వర్తింప చేయాలని కూడా అంటున్నాయి. జనగణన పూర్తయిన వెంటనే నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను చేపట్టాలి. లోక్‌సభ, శాసనసభల సీట్లకు సంబంధించి గ్రామీణ, నగర ప్రాంతాలను దృష్టిలో పెట్టుకోవాలి. నియోజకవర్గాల పునర్విభజన జరిగి, అందరికీ సమాన ప్రాతినిధ్యం కల్పించాలని సూచిస్తున్నాయి. అందుకు అనుగుణంగా ఇప్పటి నుంచే కేంద్రంలోని మోదీ సర్కార్ జాతీయ, ప్రాంతీయ పార్టీలతో సమాలోచనలు జరిపి వారి అభిప్రాయాలు కూడా తీసుకుంటే మంచిది. 1951 జనగణన లెక్కల ఆధారంగా మొదటిసారి డీలిమిటేషన్ ప్రక్రియ జరిగింది. దేశంలో ఎన్నికల వ్యవస్థకు స్పష్టమైన రూపం తీసుకొచ్చేందుకుగాను మొదటి విడత కసరత్తు జరిగింది. ఆ తర్వాత 1961 జనగణన లెక్కల ఆధారంగా రెండోసారి డీలిమిటేషన్ ప్రక్రియ జరిగింది. తద్వారా స్వాతంత్ర్యానంతరం మొదటి దశాబ్దంలో పెరిగిన జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాలకు మరింత కచ్చితమైన రూపం తీసుకొచ్చారు. రెండో విడత నియోజకవర్గాల పునర్విభజన ద్వారా లోక్‌సభ స్థానాలను 494 నుంచి 522కు పెంచారు. అలాగే దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల శాసనసభల స్థానాలను 3,771గా నిర్ణయించారు. ఆ తర్వాత 1971 జనగణన ఆధారంగా 1973లో మూడో విడత నియోజకవర్గాల పునర్విభజన చేపట్టారు. ఈసారి లోక్‌సభ స్థానాలను 522 నుంచి 543కి పెంచి, అసెంబ్లీల స్థానాలను 3771 నుంచి 3,997గా ఖరారు చేశారు. అంతేకాకుండా 2001 వరకు లోక్‌సభ స్థానాలను యథాతథంగా ఉంచాలని 42వ రాజ్యాంగ సవరణ ద్వారా చేశారు. మళ్లీ మూడు దశాబ్దాల తర్వాత 2001 జనాభా లెక్కల ఆధారంగా 2002 డీలిమిటేషన్ చట్టాన్ని తీసుకొచ్చారు. కానీ, లోక్‌సభ స్థానాల సరిహద్దులను మాత్రమే మార్చి, సీట్ల సంఖ్యను మాత్రం యథాతథంగా కొనసాగించారు. అంతేకాదు, 2026 వరకు డీలిమిటేషన్ ప్రక్రియ చేపట్టకూడదని కూడా నిర్ణయించారు. కొత్త రాష్ట్రాలు ఏర్పడినందున అసెంబ్లీ స్థానాలను మాత్రం 4,123కి పెంచారు. అలాగే 1971 జనగణన ఆధారంగా చేపట్టిన పునర్విభజనతో నిర్ణయించిన లోక్‌సభ సీట్ల సంఖ్య 2026 తర్వాత మొదటిసారి జరిగే జనగణన వరకు యథాతథంగా ఉండాలని 84వ రాజ్యాంగ సవరణ ద్వారా నిర్ణయించారు. ఇప్పుడు జనాభా ఆధారంగా లోక్‌సభ సీట్లు పెంచితే దక్షిణాది రాష్ట్రాల్లో తక్కువ సంఖ్యలో, ఉత్తరాది రాష్ట్రాల్లో ఎక్కువ సంఖ్యలో సీట్లు పెరిగే అవకాశం ఉన్నది. 2026లో జరిగే నియోజకవర్గాల పునర్విభజనలో ఈ అంశం వివాదాస్పదంగా మారే సూచనలూ కన్పిస్తున్నాయి. ఇప్పటికే దక్షిణాది రాష్ట్రాలకు చెందిన అనేక మంది రాజకీయ నాయకులు ఈ అంశంపై గళమెత్తుతున్నారు. 1973లో జరిగిన పునర్విభజన తరహాలోనే రాష్ట్రాలకు లోక్‌సభ సీట్ల సంఖ్యను కేటాయించాలని వారు వాదిస్తున్నారు.

# గెలుపు వారిదే ...

హైదరాబాద్,జూబ్లీహిల్స్ లో ఉప ఎన్నికకు ప్రధాన పార్టీలు సమాయత్తం అవుతున్నాయి. సీఎం రేవంత్ సైతం పార్టీ సమావేశంలో బై పోల్ పైన దిశా నిర్దేశం చేసారు. అభ్యర్థి ఎవరనేది హైకమాండ్ నిర్ణయిస్తుంద ని తేల్చి చెప్పారు. ఎవరికి వారు తామే అభ్యర్థిగా ప్రకటించుకోవద్దని స్పష్టం చేసారు. బీఆర్ఎస్ కు ఈ ఉప ఎన్నిక ప్రతిష్ఠాత్మకంగా మారుతోంది. బీజేపీ తమ మిత్రపక్షాలతో ఈ ఎన్నిక పైన చర్చలు చేస్తోంది. ఇక, తాజాగా ఈ బై పోల్ పైన ఒక ప్రధాన పార్టీ సర్వే చేయించగా.. అందులో ఆసక్తి కర అంశాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం.

మారుతున్న లెక్కలు

బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో జూబ్లీహిల్స్ బై పోల్ అనివార్యంగా మారింది. ఈ సీటును తిరిగి దక్కించుకో వటం బీఆర్ఎస్ కు ప్రతిష్ఠాత్మకంగా మారుతోంది. కాంగ్రెస్ సైతం ఈ సీటు పైన ఆశలు పెంచుకుంటోంది. గ్రేటర్ పరిధిలో 2023 ఎన్నికల్లో ఒక్క సీటు గెలవ లేక పోయిన కాంగ్రెస్ కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో విజయం సాధించింది. బీఆర్ఎస్ సిట్టింగ్ సీటు ను కైవసం చేసుకుంది. ఇప్పుడు అదే తరహాలో జూబ్లీహిల్స్ ను గెలుచుకోవాలని భావిస్తోంది. కాగా, ఇక్కడ సామాజిక సమీకరణాల్లో భాగంగా ఎంఐఎం పాత్ర కీలకంగా మారుతోంది. ఎంఐఎం పోటీ చేస్తుందా లేదా అనేది స్పష్టత రావాల్సి ఉంది. కాంగ్రెస్ నుంచి ఇప్పటికే అజాహరుద్దీన్ తానే పోటీ చేస్తానని ప్రకటించారు. కాగా.. రేవంత్ మాత్రం అభ్యర్థిని పార్టీ నిర్ణయిస్తుందని చెప్పారు.

బీఆర్ఎస్ కసరత్తు

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం బీఆర్ఎస్ కసరత్తు మొదలు పెట్టింది. తమ పార్టీ నుంచి రెండు సార్లు విజయం సాధించిన గోపీనాథ్ కుటుంబానికి సీటు ఇవ్వాలని భావిస్తోంది. నియోజకవర్గం లో పబ్లిక్ పల్స్ పైన ఒక ప్రధాన పార్టీ సర్వే చేయిస్తున్నట్లు సమాచారం. గోపీనాథ్ సతీమణి సునీతను బరిలోకి దింపాలనేది బీఆర్ఎస్ ఆలోచనగా ఉంది. అయితే, గోపీనాథ్ కుటుంబ సభ్యులు ఈ అంశం పైన ఇంకా నిర్ణయానికి రాలేద ని గులాబీ పార్టీ నేతలు చెబుతున్నారు. సునీత బరిలోకి దిగటానికి అంగీరించకుంటే విష్ణు వర్ధన్ రెడ్డికి సీటు ఇస్తే ఫలితం ఎలా ఉంటుందని బీఆర్ఎస్ ఆలోచన చేస్తుంది. కాగా, సర్వేలో నియోజక వర్గ ప్రజల మూడ్ తెలుసుకునేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. మాగంటి కుటుంబ సభ్యులకే సీటు ఇస్తేనే బీఆర్ఎస్ కు కలిసి వచ్చే పరిస్థితి ఉన్నట్లు సర్వే సంస్థల సమాచారం. కాగా, ఎంఐఎం సహకారం ఏ రూపంలో కాంగ్రెస్ కు అందినా... అధికార పార్టీకి సీటు దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తేల్చినట్లు తెలుస్తోంది.

గెలుపు ప్రతిష్ఠాత్మకం

ఇక్కడ గెలుపు సిట్టింగ్ సీటు కావటంతో బీఆర్ఎస్ ... అధికారంలో ఉండటంతో కాంగ్రెస్ కు ప్రతిష్ఠా త్మకంగా మారుతోంది. ఇదే సమయంలో బీజేపీ నుంచి ఒక పారిశ్రామిక వేత్త పేరు ప్రముఖంగా ఈ సీటు కోసం వినిపిస్తోంది.

# యుద్ధభూముల్లో జీవితపోరాటం



సెంట్రల్ డెస్క్:బాంబుల దాడులు, సైనిక బలగాల కవాతు విన్యాసాలు, సైరన్ల హెచ్చరికలు, నగరాల విధ్వంసాలు.. ఇలాంటి అత్యంత భయానక వాతావరణం లోనూ తమ జీవనపోరాటం కోసం ఆరోగ్య సంరక్షకులుగా, నిర్మాణాల కూలీలుగా, తాపీ మేస్త్రీలుగా, ఎలక్ట్రీషియన్లు, పెయింటర్లుగా ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల్లో ఎందరో భారతీయులు గత కొన్నేళ్లుగా మనుగడ సాగిస్తున్నారు. అక్కడి యూనివర్సిటీల్లోనూ ఎందరో భారతీయ విద్యార్థులు చదువుకొంటున్నారు. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ ఇరాన్ దేశాల మధ్య కొన్ని రోజులపాటు యుద్ధం బీభత్సంగా సాగింది. ప్రవాస భారతీయులను స్వదేశానికి రప్పించాలన్న బాధ్యతతో భారత ప్రభుత్వం ఆపరేషన్ సింధు పేరుతో అక్కడి భారతీయులను తరలించడం ప్రారంభించింది. పొరుగు దేశాలైన శ్రీలంక, నేపాల్ వాసులకు కూడా ఆపరేషన్ సింధు సహకరిస్తోంది. ఇప్పటివరకు ఇరాన్ నుంచి 2858 మందిని, ఇజ్రాయెల్ నుంచి 818 మందిని కేంద్ర ప్రభుత్వం రప్పించ గలగడం హర్షించదగిన చొరవే.అయితే గత కొన్నేళ్లుగా ఆ దేశాల్లో వివిధ వృత్తులు, ఉద్యోగాలు చేస్తూ బతుకుతున్న వారు మాత్రం తిరిగి భారత్‌కు రావడానికి ఇష్టపడడం లేదు. దేశాల యుద్ధం కన్నా తమ జీవన పోరాటం ముఖ్యమన్న అభిప్రాయం వారిలో కనిపిస్తోంది. ప్రపంచంలోనే నాలుగో ఆర్థిక అభివృద్ధి దేశంగా ఎదుగుతున్న భారత్‌లో ప్రస్తుతం ఉంటున్న భారతీయుల్లో కొందరు ఆ దేశాలే తమ జీవనోపాధికి గమ్యస్థానాలన్న ఆకాంక్షను వెలిబుచ్చుతున్నారు. భారత ప్రభుత్వానికి ఇదో పెద్ద సవాలు. దేశంలో పౌరుల భద్రతకు ఢోకా లేదని, ఇతరత్రా సహకారం లభిస్తుందన్న కేంద్ర ప్రభుత్వ హామీలు ఉంటున్నా దాని ప్రభావం ఎంతవరకు పనిచేస్తుందో ప్రశ్నార్థకం. ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల్లో ప్రస్తుతం ఉంటున్న భారతీయుల్లో కేవలం 10 నుంచి 12 శాతం మంది మాత్రమే స్వదేశం భారత్‌కు తిరిగి వస్తున్నారని ఇజ్రాయెల్ లోని ప్రవాస భారతీయ ప్రతినిధులు చెబుతున్నారు.ఇజ్రాయెల్‌లో 15,000 మంది భారతీయులు ఆరోగ్య సంరక్షకులుగా ఉద్యోగాలు చేస్తున్నారు. వీరిలో చాలామంది తెలంగాణ, కేరళ రాష్ట్రాలకు చెందినవారే. ఇజ్రాయెల్‌లో తెలంగాణ ఆరోగ్య సంరక్షకులు నెలకు రూ. 1,50,000 వరకు సంపాదిస్తున్నారు. ఆహారం, వసతి తదితర సౌకర్యాలు వీరికి ఉచితంగా లభిస్తున్నాయి. ఇటువంటి సౌకర్యాలు స్వదేశం భారత్‌లో తమకు లభిస్తాయా? అన్న ప్రశ్న ఎదురవుతోంది. 'సంఘర్షణ అన్నది తమకు కొత్తేమీ కాదు. హమాస్, హెజ్బొల్లా, హౌతీస్ ఇలా ఎన్నో ఉగ్రవాద గ్రూపుల నుంచి నిత్యం తమకు సంఘర్షణలు ఎదురవుతూనే ఉన్నాయి. కానీ ఇజ్రాయెల్ ఐరన్‌డ్రోమ్ మమ్మల్ని నిత్యం రక్షిస్తోంది. స్కూళ్లు, ఆస్పత్రులు, షాపింగ్ మాల్స్, అపార్టుమెంట్లు ఇలా ప్రతిచోట భూగర్భ బంకర్లు ఉన్నాయి. అందువల్ల మా భద్రతకు ఎలాంటి ముప్పు ఉండదు' అన్న నమ్మకం ప్రవాస భారతీయుల్లో కనిపిస్తోంది.ఇక విద్యార్థుల చదువుల విషయానికొస్తే ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల్లో చదువులకయ్యే ఖర్చు భారత్‌తో పోలిస్తే చాలా తక్కువ. ఒక్క ఇరాన్‌లోనే 4000 మంది భారతీయ విద్యార్థులు చదువుకొంటున్నారు. వీరిలో సగానికి సగం మంది కశ్మీర్ విద్యార్థులే. భారత్‌లో ఎంబిబిఎస్ సీటు ప్రైవేట్ కాలేజీల్లో సంపాదించాలంటే రూ. కోటి వరకు ఖర్చు పెట్టవలసివస్తుంది. అదే ఇరాన్‌లో మొత్తం ఎంబిబిఎస్ కోర్సుకు రూ. 30 లక్షలు మాత్రమే ఖర్చవుతుంది. దీనికి కారణం ఇరాన్‌లో యూనివర్సిటీలకు అక్కడి ప్రభుత్వం సబ్సిడీలు అందిస్తోంది. 2023 లో భారత్ ఇజ్రాయెల్ మధ్య ఒప్పందం ఫలితంగా నిర్మాణ రంగం, నర్సింగ్‌ల్లో భారత కార్మికుల కోటా పెరిగింది. నెలవారీ వేతనాలు రూ. లక్ష దాటాయి. దీనికి తోడు వైద్య బీమా వంటి సౌకర్యాలు లభిస్తున్నాయి. ఇటువంటి ప్రయోజనాలు భారత్‌లో లభిస్తాయని ఊహించడం కష్టమే.ఇదిలా ఉండగా యుద్ధం జరిగే ప్రాంతాల్లో ఉద్యోగాలు, వృత్తులు చేయడం ప్రాణాలతో చెలగాటం. కానీ దీనికి ప్రవాసీయులు భయపడడం లేదు. పైగా యుద్ధం జరిగే చోట పనులు చేస్తే తమకు ఎక్కువ ఆదాయం లభిస్తుందని చెబుతున్నారు. స్వదేశంలో లభించే ఆదాయం కన్నా ఏడాదిలో ఐదు రెట్లు ఆదాయం సంపాదించవచ్చని అంటున్నారు. యుద్ధాల బాధితులమని వారు ఆవేదన చెందడం లేదు. అలా తమను గుర్తించవద్దని స్పష్టం చేస్తున్నారు. ఇటువంటి ప్రవాస భారతీయుల్లో అనేక మంది ఆర్థికంగా, సామాజికంగా బాగా వెనుకబడిన వారే కావడం గమనార్హం. స్వదేశంలో తమకు తగిన వేతనాలు ఎక్కువగా లభిస్తాయన్న ఆశ వారిలో కలగడం లేదు. అందుకే ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధోన్మాద దేశాలైనప్పటికీ, తమ బతుకులకు ఆసరా కల్పించే దేశాలన్న నమ్మకం వారిలో కనిపిస్తోంది.ఇక భారతీయులను తరలించే రిస్కు ఆపరేషన్లు కూడా వారికి కొత్తేమీ కాదు. 2023 ఏప్రిల్ మే నెలల్లో 3000 మంది కన్నా ఎక్కువ మంది భారతీయులు సూడాన్ నుంచి ఆపరేషన్ కావేరీ ద్వారా విమానాల్లో భారత్‌కు తరలి వచ్చారు. అంతకు ముందు 1990లో మొదటి గల్ఫ్ యుద్ధంలో భారతీయులను తరలించడం జరిగింది. 2015 లో యెమెన్ నుంచి ఆపరేషన్ రాహత్ పేరున, అలాగే 2022లో ఉక్రెయిన్ నుంచి భారతీయ పౌరులను తరలించే ప్రయత్నాలు జరిగాయి. యుద్ధభూముల్లో వ్యక్తిగత భద్రత కన్నా ఆర్థిక భద్రత, కుటుంబ సంక్షేమం ప్రాధాన్యాలుగా ఉంటున్నాయి. పొరుగున ఉన్న గాజాలో యుద్ధ భయానక సంఘటనలు, పౌరుల మరణాలు, విధ్వంసాలు ఎక్కువగా సాగుతున్నప్పటికీ, అవేవీ వీరు పట్టించుకోవడం లేదు. యుద్ధవ్యూహాల కన్నా మనుగడ వ్యూహాలే ముఖ్యం అన్న లక్ష్యం వీరిని యుద్ధభయం లేకుండా ముందుకు నడిపిస్తోంది.

# అంతరిక్ష చరిత్రలో కొత్త అధ్యాయం

న్యూఢిల్లీ,భారత అంతరిక్ష చరిత్రలో మరో కొత్త అధ్యాయం మొదలైంది. విశ్వవినువీధుల్లో దేశ కీర్తిపతాక రెపరెపలాడే మధురఘట్టం ఆవిష్కృతమైంది. కోట్లమంది భారతీయుల ఆకాంక్షలు, శుభాశీస్సులను గుండెల నిండా నింపుకొని మన వ్యోమగామి శుభాంశు శుక్లా రోదసిలోకి పయనమయ్యారు. ఆయనతో కలిసి మరో ముగ్గురు వ్యోమగాములను తీసుకుని యాక్సియం-4 నింగిలోకి దూసుకెళ్లింది. భారత వ్యోమగామి శుభాంశు శుక్లా బుధవారం రోదసిలోకి బయల్దేరారు. ఫ్లోరిడాలోని నాసా కెన్నెడీ స్పేస్‌సెంటర్ నుంచి ఫాల్కన్ 9 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. ఫ్లోరిడాలోని నాసా కెన్నెడీ స్పేస్ సెంటర్‌లో బుధవారం మధ్యాహ్నం 12:01 గంటలకు (భారత కాలమానం ప్రకారం) చేపట్టిన ఫాల్కన్ 9 రాకెట్ ప్రయోగం విజయవంతంగా అంతరిక్షంలోకి వెళ్లింది. కొద్ది క్షణాల తర్వాత రాకెట్‌నుంచి వీరి క్యాప్సుల్ విడిపోయి ఐఎస్ఎస్ దిశగా ప్రయాణం కొనసాగించింది. అమెరికాకు చెందిన వాణిజ్య అంతరిక్ష సంస్థ 'యాక్సియం స్పేస్' ఈ మిషన్‌ను చేపట్టింది.భారత రోదసి పరిశోధన సంస్థ (ఇస్రో), అమెరికా అంతరిక్ష సంస్థ (నాసా), ఐరోపా అంతరిక్ష సంస్థ (ఇఎస్ఎ)లు ఇందులో భాగస్వామ్యం వహించాయి. అంతరిక్షంలో ఆయనను 'శుక్స్'గా పిలవనున్నారు. వీరు 28 గంటల ప్రయాణం తర్వాత భూమికి 400 కిలోమీటర్ల ఎత్తులోని అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్)చేరుకుంటారు. గురువారం సాయంత్రం 4.30 గంటలకు (భారత కాలమానం ప్రకారం) వీరి వ్యోమనౌక ఐఎస్ఎస్‌తో అనుసంధానం అవుతుంది. ఐఎస్ఎస్‌లో శుభాంశు బృందం (%ాబఎష్టుఅంష్ట్రబ ుఎ%) 14 రోజులపాటు ఉంటుంది. భారరహిత స్థితిలో పలు ప్రయోగాలు నిర్వహించడంతోపాటు ప్రధాని నరేంద్ర మోడీ పాఠశాల విద్యార్థులు, ఇతరులతో అక్కడినుంచి ముచ్చటిస్తారు. ఈ ప్రయాణం ద్వారా శుభాంశు గడించే అనుభవం.. 2027లో చేపట్టే స్వీయ మానవసహిత యాత్ర గగన్‌యాన్‌కు ఉపయోగపడుతుందని ఇస్రో చెబుతోంది.ఐఎస్ఎస్‌లో శుభాంశు ఇస్రో తరపున ఏడు ప్రయోగాలు నిర్వహిస్తారు. దీర్ఘకాల రోదసి యాత్రల సమయంలో పోషకాహారం, జీవనాధార వ్యవస్థల విషయంలో ముందడుగు వేయడానికి ఉద్దేశించిన ప్రయోగం కూడా ఇందులో ఉంది. భారరహిత స్థితి వల్ల ఎముకలు, కండరాలు, గుండె, రక్తనాళాలు, రోగనిరోధక వ్యవస్థపై ప్రభావాన్ని శోధిస్తారు. నాసా నిర్వహించే ఐదు ఉమ్మడి అధ్యయనాల్లో శుభాంశు పాల్గొంటారు. మొత్తం మీద యాక్సియం-4 వ్యోమగాములు 31 దేశాలకు చెందిన 60 శాస్త్రీయ ప్రయోగాలను నిర్వహిస్తారు. తద్వారా ఐఎస్ఎస్‌లో ఒకే మిషన్‌లో అత్యధిక సంఖ్యలో ప్రయోగాలు చేపట్టినట్లవుతుంది. ఈ ప్రయోగంతో 41 ఏళ్ల తర్వాత మన వ్యోమగామి ఒకరు రోదసిలో భారరహిత స్థితిలో తేలియాడబోతున్నారు. అంతకు ముందు 1984లో సోవియట్ యూనియన్‌కు చెందిన ఇంటర్‌కాస్మోస్ కార్యక్రమం కింద సోయుజ్ టి-11 వ్యోమనౌకలో రాకేశ్‌శర్మ అంతరిక్షంలోకి వెళ్లి వచ్చారు.ఆ తర్వాత భారత పౌరుడొకరు రోదసియానం చేయడం మళ్లీ ఇప్పుడే. వ్యోమనౌకలోకి వెళ్లడానికి ముందు శుభాంశు తనకు ఎంతో ఇష్టమైన పాటను విన్నారు. గతేడాది విడుదలైన 'ఫైటర్' సినిమాలోని 'వందేమాతరం' అనే పాట శుభాంశు శుక్లాకు చాలా ఇష్టమట. అందుకే, రోదసిలోకి వెళ్లేముందు ఈ పాటనే ఆయన విన్నారు. 'విజయం అనేది ప్రతి భారతీయుడి నరనరాల్లో ఉంటుంది. మన పరాక్రమానికి శత్రువు కూడా సెల్యూట్ చేస్తాడు' అంటూ సాగే ఈ పాట దేశభక్తిని రగిలిస్తుంది. ప్రముఖ దర్శకుడు సిద్ధార్థ్ ఆనంద్ రూపొందించిన 'ఫైటర్' సినిమాలో బాలీవుడ్ నటీనటులు హృతిక్ రోషన్, దీపికా పదుకొణె, అనిల్‌కపూర్ తదితరులు నటించారు. బంకింగ్ చంద్ర ఛటర్జీ రాసిన లిరిక్స్‌ను రీమిక్స్ చేసి రూపొందించిన 'వందేమాతరం' పాటను విశాల్ దడ్లానీ పాడారు. సాధారణంగా వ్యోమగాములు రోదసియాత్ర చేపట్టే ముందు వారికి ఇష్టమైన సంగీతం వినడం నాసాలో



కొంతకాలంగా వస్తోన్న ఆనవాయితీ.ఎలాంటి కంగారుపడకుండా మిషన్‌పై దృష్టిపెట్టేందుకు ఇలా మ్యూజిక్ వింటారు. ఒత్తిడిని తగ్గించేందుకు సంగీతం శక్తిమంతమైన సాధనం అని పలు అధ్యయనాల్లోనూ తేలిన సంగతి తెలిసిందే. 'భారత్ మళ్లీ అంతరిక్షంలోకి వస్తోంది, జై హింద్!' అంటూ భారత వ్యోమగామి శుభాంశు శుక్లా తన చారిత్రక అంతరిక్ష యాత్రకు ముందు ఉద్వేగభరితంగా పేర్కొన్నారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) వెళ్లనున్న తొలి భారతీయుడిగా, అంతరిక్షంలో అడుగుపెట్టనున్న రెండో భారతీయుడిగా ఆయన చరిత్ర సృష్టించనున్నారు.ఈ సందర్భంగా శుక్లా తన భార్య కామ్నాకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక భావోద్వేగ సందేశాన్ని పంచుకున్నారు. 'నా అద్భుతమైన భాగస్వామి కామ్నాకు ప్రత్యేక ధన్యవాదాలు.నువ్వు లేకుండా ఇదంతా సాధ్యమయ్యేది కాదు. అంతకన్నా ముఖ్యంగా దీనికి ఏ విలువా ఉండేది కాదు' అని ఆయన పేర్కొన్నారు. గాజు గోడకు చెరోవైపు ఉండి వీడ్కోలు చెప్పుకుంటున్న ఫొటోను కూడా ఆయన పంచుకున్నారు. యాక్సియమ్ స్పేస్ సంస్థ, నాసా, స్పేస్‌ఎక్స్‌ల సహకారంతో ఈ యాత్రను నిర్వహిస్తోంది. ఈ యాత్రలో విభిన్న దేశాలకు చెందిన అంతర్జాతీయ సిబ్బంది పాలుపంచుకుంటున్నారు. వాణిజ్య, ప్రపంచ అంతరిక్ష పరిశోధనలో ఇది ఒక ముఖ్యమైన ముందడుగుగా భావిస్తున్నారు. ఈ యాత్రలో శుభాంశు శుక్లా పైలట్‌గా వ్యవహరించనుండగా, అమెరికాకు చెందిన పెగ్గీ విట్సన్ కమాండర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తారు. పోలాండ్‌కు చెందిన స్లావోస్జ్ ఉజ్నాన్స్కి-విస్నియెస్కి, హంగేరీకి చెందిన టిబోర్ కాపు మిషన్ స్పెషలిస్టులుగా ఈ బృందంలో ఉన్నారు.

## అర్బన్ ఫారెస్టుల అభివృద్ధికి కృషి

హైదరాబాద్, హైదరాబాద్ నగరం చుట్టూ ఉన్న అర్బన్ ఫారెస్ట్ బ్లాక్‌లను అభివృద్ధి చేస్తున్నారు. పచ్చదనంలో భాగంగా పార్కులకు మహర్దశ కలుగనుంది. హెచ్ఎండీఏ అర్బన్ ఫారెస్ట్ పార్కులు గా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. నగరం చుట్టూ వివిధ ప్రాంతాల్లో 189 అర్బన్ ఫారెస్ట్ బ్లాక్ లు ఉండగా, 45 బ్లాక్ లను పార్కులుగా అభివృద్ధి చేస్తున్నామని, వీటిలో 17 పార్కులు పూర్తయ్యాయని అధికారులు చెప్పారు. దశల వారీగా వీటిని అభివృద్ధి చేస్తామంటున్నారు. అర్బన్ ఫారెస్ట్?పార్కులను అభివృద్ధి చేయడం వల్ల ప్రజలకు విహార కేంద్రాలుగా ఉపయోగపడతాయని, ఫ్యామిలీతో వెళ్లి గడపడానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు తెలిపారు. అలాగే నగరంలో పచ్చదనం పెంచడంపై హెచ్ఎండీఏ దృష్టి పెట్టింది. ముఖ్యంగా ఔటర్ రింగ్‌రోడ్, నేషనల్‌హైవేస్, ట్రిపుల్‌ఆర్‌వరకు ఆయా ప్రాంతాల్లో పచ్చదనాన్ని విస్తరించేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. త్వరలో నిర్వహించనున్న వనమహోత్సవంలో భాగంగా 4.5 కోట్ల మొక్కలు నాటాలని అర్బన్ ఫారెస్టీ ఆఫీసర్లు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. గతేడాది వనమహోత్సవం కింద 6.8 కోట్ల మొక్కలు నాటామని, ఇది మంచి ఫలితాలు ఇవ్వడంతో ఈసారి 4.5 కోట్ల మొక్కలు నాటాలని నిర్ణయించినట్టు చెబుతున్నారు.

# గద్వాల తరహాలో మరో ఇల్లాలు ఘాతుకం

అనంతపురం,తెలంగాణలోని గద్వాలలో ప్రైవేట్ సర్వేయర్ తేజేశ్వర్ హత్య కేసును మరిచిపోకముందే.. ఏపీలో మరో ఘోరం చోటుచేసుకుంది. సరిగ్గా అలాంటి ఘటనే చోటుచేసుకుంది. తన వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భావించిన భార్య భర్తను చంపించింది. ప్రియుడి సాయంతో భర్తను అడ్డుతొలగించే క్రమంలో భర్తను హత్య చేయించింది. ఈ దారుణ ఘటన అనంతపురం రూరల్ మండలం అక్కంపల్లి-రాచానపల్లి రోడ్డులో చోటుచేసుకుంది. అక్కంపల్లిలో చిన్న హోటల్ నిర్వహిస్తున్న సురేష్‌బాబు(43) అనే వ్యక్తి హత్య ఘటన వెలుగులోకి వచ్చిన కేవలం ఆరు గంటల్లోనే పోలీసులు ఈ కేసును ఛేదించారు. భార్యే అసలు సూత్రధారి అని గుర్తించారు. ఈ కేసులో సురేష్ భార్య అనిత (37), ఆమె ప్రియుడు ఫక్రుద్దీన్(34)ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుపై పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం..'సురేష్‌బాబు స్థానిక కల్యాణదుర్గం రోడ్డులో ఓ చిన్న హోటల్ నడుపుతున్నాడు. అతడి భార్య అనిత తొలుత ఓ హోటల్‌లో పనిచేసేది. ఈమెకు రెండు నెలల కిందటే బాబా ఫక్రుద్దీన్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. అతడు పదేళ్ల కిందట స్వగ్రామమైన గొరదిండ్ల నుంచి స్థానిక సదాశివకాలనీకి కుటుంబం సహా మకాం మార్చాడు. అతడు ఊరూరా తిరుగుతూ పండ్లు విక్రయిస్తుంటాడు. ఈ క్రమంలోనే అనిత, బాబా ఫక్రుద్దీన్‌ల మధ్య వివాహేతర సంబంధం మొదలైంది. భర్త సురేష్‌బాబుకు అనుమానం రావడంతో భార్యను తాగొచ్చి వేధించేవాడు. తనను అనుమానిస్తుండటం, అదే సాకుతో వేధిస్తుండటం వంటి విషయాలన్నీ అనిత తన ప్రియుడు ఫక్రుద్దీన్‌కు చెప్పింది. తమ వివాహేతర సంబంధానికి అడ్డుతగులుతున్న భర్తను ఎలాగైనా చంపితే ఇద్దరం సంతోషంగా ఉండొచ్చని ప్రియుడిని ఉసిగొల్పింది. ప్రతిరోజు రాత్రి హోటల్ మూసేసి తన భర్త టూవీలర్‌పై ఇంటికొస్తాడని, ఆ సమయంలో చంపితే సరిపోతుందని కుట్ర పన్నింది. ఇందుకు సరేనని అంగీకరించిన బాబా ఫక్రుద్దీన్.. వ్యాపారం నిమిత్తం మార్తాడు గ్రామానికి వెళ్లాడు. ఆ సమయంలో అతడికి ఫోన్ చేసిన అనిత.. ఎలాగైనా తన భర్తను ఈరోజు చంపాలని సూచించింది. దీంతో హోటల్ మూసేసి.. రాత్రి 11 గంటల సమయంలో సదాశివ కాలనీకి బైక్‌పై బయల్దేరిన సురేష్‌బాబుపై మార్గ మధ్యలో బాబా ఫక్రుద్దీన్ దాడి చేశాడు. అక్కడే అందుబాటులో ఉన్న సీసాను సురేష్‌బాబుపై విసిరాడు. దీంతో ద్విచక్రవాహనం సహా కిందకు పడిన అతడిపై ఫక్రుద్దీన్ దాడి చేశాడు. తన వెంట తీసుకెళ్లిన స్క్రూడ్రైవర్‌తో పొడిచి ఆ తర్వాత బండరాయితో బాది హత్య చేసిన తర్వాత అక్కడి నుంచి పరారయ్యాడు. అక్కంపల్లి సమీపంలో హత్య జరిగిందనే విషయం తెలిసిన వెంటనే జిల్లా ఎస్పీ పి.జగదీశ్ రంగంలోకి దిగారు. అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు పర్యవేక్షణలో సీఐ శేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దింపారు. నిందితుల కోసం గాలించి.. పక్కా సమాచారంతో కేవలం ఆరు గంటల్లోనే వారిని అరెస్టు చేశారు. ఈ కేసు ఛేదించిన పోలీసుల బృందాన్ని ఎస్పీ అభినందించారు.

# ఇంద్రకీలాద్రిపై వారాహి ఉత్సవాలు

విజయవాడ,ఇంద్రకీలాద్రిపై ఆషాఢ సారె మహోత్సవం కొనసాగుతోంది. స్వర్ణాభరణాలతో పసిడికాంతులు వెదజల్లే కనకదుర్గమ్మను ఆడపడుచుగా భావించి భక్తులు సారెను తీసుకొస్తున్నారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఆషాఢ మాసం సందర్భంగా..గురువారం నుంచి జులై 24 వరకు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. దేవస్థానం కార్యనిర్వహణ అధికారి శీనానాయక్ దంపతులు అమ్మవారికి ఆషాఢ సారెను సమర్పించారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఇంద్రకీలాద్రి నకదుర్గమ్మ ఆలయం లో గురువారం నుంచి నెల రోజులపాటు వారాహి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఈవో శీనానాయక్ దంపతులు తొలి సారెను సమర్పించారు. మేళతాళాలతో మంగళ వాయిద్యాల నడుమ అమ్మవారికి సారే సమర్పించారు. పసుపు, కుంకుమ, పువ్వులు, గాజులు, చలిమిడి, గోరింటాకు అమ్మవారికి శేష వస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఈవో శీనానాయక్ మీడియాతో మాట్లాడారు. తమ చేతుల మీదుగా అమ్మవారికి సారె సమర్పించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆషాఢ మాసంలో అమ్మవారిని తమ పుట్టింటికి రమ్మని వేడుకుంటూ సారె సమర్పించామన్నారు. ఆషాఢ మాసంలో నెల రోజులపాటు అంగరంగ వైభవంగా సారే సమర్పణ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. తెలంగాణ నుంచి అమ్మవారికి ఈనెల 29వ తేదీన బంగారు బోనం సమర్పిస్తారని చెప్పుకొచ్చారు. ఈ మాసంలోనే అమ్మవారికి శాఖాంబరి ఉత్సవాలు జరుగుతాయన్నారు. జులై 8 , 9, 10 తేదీల్లో శాకంబరీ ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఈరోజు నుంచి నెల రోజులపాటు ఇంద్రకీలాద్రిపై వారాహి ఉత్సవాలు జరుగుతాయని ఈవో శీనానాయక్ వెల్లడించారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు భక్తులు సారెను సమర్పించడం ఆనవాయితీ. తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటక నుంచీ దుర్గమ్మకు భక్తులు సారె సమర్పిస్తారు. మహామండపం ఆరో అంతస్తులో ఉత్సవమూర్తిని ప్రతిష్ఠించి పూజలు చేస్తారు. మూలవిరాట్ దర్శనం అనంతరం ఉత్సవమూర్తికి సారెను సమర్పిస్తారు. కాగా, వైదిక కమిటీ సూచనల మేరకు హోమ గుండాలు, భక్తులు కూర్చునేందుకు తివాచీలు ఏర్పాటు తదితర అంశాలపై ఈవో శీనా నాయక్ ఇప్పటికే అధికారులకు పలు సూచనలు చేశారు. వారాహి అమ్మవారి నవరాత్రుల గురించి ప్రచారం చేసి విజయవంతం చేయాలని పలు విభాగాలకు ఆదేశాలిచ్చారు. వారాహి ఉత్సవాలు జులై 24వ తేదీ వరకూ నిర్వహించనున్నారు.

# మరోమూడేళ్లు సిఎం రేవంత్ రెడ్డే

హైదరాబాద్,మరోమూడేళ్లు రేవంత్‌రెడ్డే సీఎంగా ఉంటారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ సీఎం పదవిపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఐదేళ్లు మళ్లీ ముఖ్యమంత్రి కావడానికి రేవంత్‌రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. తొమ్మిదేళ్ల తర్వాత సీఎం కావడానికి తాను ప్రయత్నం చేస్తానని తెలిపారు. రేవంత్‌రెడ్డి సీఎంగా దిగిపోయాక తాను ముఖ్యమంత్రిని కావడానికి ప్రయత్నం చేస్తానని అన్నారు. ఆ క్రమంలో తన అప్లికేషన్ ప్రజల దగ్గర పెడుతానని చెప్పుకొచ్చారు. గురువారం గాంధీభవన్‌లో జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడారు. ఇకపోతే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకి జగ్గారెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. కవిత ప్రతి విషయాన్ని రాద్ధాంతం చేస్తోందని మండిపడ్డారు. కవిత బీఆర్ఎస్‌లో ఉంటే ఏంటి.. బయటకు వస్తే ఏంటని ప్రశ్నించారు. ఆమె మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. తండ్రి వారసత్వం కొడుకుకే ఉంటుందని.. ఒకవేళ కొడుకు లేకపోతే కూతురికి వచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు. తాము స్పందించే అంతటి లీడర్ కవిత కాదనే తమ అభిప్రాయమని జగ్గారెడ్డి అన్నారు. కవిత పెద్ద పెద్ద మాటలు ఎందుకు మాట్లాడుతుందో అర్థం కావడం లేదని చెప్పారు. కేసీఆర్, రేవంత్‌రెడ్డి సమానమైన ప్రాధాన్యం ఉన్న నేతలని చెప్పుకొచ్చారు. రాజకీయంగా ఒకరిని మరొకరు విమర్శించుకుంటే అర్థముందని అన్నారు. కవిత ఎందుకు అనవసరంగా తమ గురించి మాట్లాడుతోందని ప్రశ్నించారు. హాయిగా బతుకమ్మ ఆడుకోకుండా కవితకి ఎందుకు ఈ పంచాయితీ అని నిలదీశారు.

# బనకచర్ల ప్రాజెక్ట్‌పై ముదురుతున్న రాజకీయం..

హైదరాబాద్,తెలంగాణలో బనకచర్లపై పొలిటికల్ ఫైట్ ఇప్పుడప్పుడే ముగిసేలా కనిపించడం లేదు. ఈ అంశంపై ఇప్పటికే కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ రగడ పీక్స్‌కు చేరుకుంది. రేవంత్ సర్కార్ వైఫల్యం వల్లే ఈ ప్రాజెక్ట్ విషయంలో ఏపీ ప్రభుత్వం దూకుడుగా ముందుకు సాగుతోందని బీఆర్ఎస్ విమర్శనాస్త్రాలు సంధిస్తోంది. తాము ఈ అంశాన్ని లేవనెత్తే వరకు అసలు ప్రభుత్వం దీన్ని పట్టించుకోలేదని కారు పార్టీ కాంగ్రెస్‌ను టార్గెట్ చేస్తోంది. ఈ విషయంలో ఏపీ ప్రభుత్వంతో చర్చలు జరుపుతామని తెలంగాణ ప్రభుత్వం సంకేతాలు ఇవ్వడాన్ని బీఆర్ఎస్ మరింతగా తప్పుబడుతోంది. చర్చల అంశాన్ని చూపించి కాంగ్రెస్‌ని ఇరుకునపెట్టేందుకు వ్యూహరచన చేస్తోంది. ఏపీతో చర్చలు జరపడం సరికాదని.. ముందు అపెక్స్ కమిటీ సమావేశం నిర్వహించాలని కేంద్రాన్ని కోరాలని డిమాండ్ చేస్తోంది.

బీఆర్ఎస్ టార్గెట్‌గా కాంగ్రెస్ వ్యూహాలు

అయితే ఈ అంశంలో బీఆర్ఎస్‌ను ఇరుకునపెట్టేందుకు కాంగ్రెస్ కూడా పక్కా వ్యూహంతో ముందుకు సాగుతోంది. గోదావరి - బనకచర్ల ప్రాజెక్టు మీద అసెంబ్లీలో చర్చకు సిద్ధమా కేసీఆర్..? అని సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. గోదావరిలోకి 3 వేల టీఎంసీలు వెళ్తున్నాయని చెప్పింది కేసీఆర్ కాదా? అని ప్రశ్నించారు. కుట్రలు కుతంత్రాలతో కాంగ్రెస్ హయాంలో ప్రారంభించిన ఏ ఒక్క సాగునీటి ప్రాజెక్టును కేసీఆర్ పూర్తి చేయలేదని మండిపడ్డారు. గోదావరి జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం అసెంబ్లీలో చర్చిద్దామని కేసీఆర్‌కు సవాల్ విసిరారు. ఈ అంశంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ దుష్ప్రచారం చేస్తోందన్నారు.



బీఆర్ఎస్ టార్గెట్‌గా బనకచర్లపై ఉత్తమ్ ప్రజెంటేషన్

మరోవైపు గోదావరి-బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకుంటామన్నారు మంత్రి ఉత్తమ్. దీనిపై కేంద్ర జలశక్తి మంత్రికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చామని.. త్వరలోనే అపెక్స్ కౌన్సిల్ సమావేశానికి కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. ఈ నెల 30న బనకచర్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తామన్న ఉత్తమ్.. గతంలో బీఆర్ఎస్ ఈ ప్రాజెక్ట్‌కు ఎలా సహకరించిందో వివరిస్తామన్నారు. గతంలో ప్రగతిభవన్ వేదికగా ప్రాజెక్టు డిజైన్ అయిందన్నారు.

బనకచర్లపై బీఆర్ఎస్, కాంగ్రెస్ రాజకీయ ఎత్తులు

ఇటు బీఆర్ఎస్, అటు కాంగ్రెస్ రెండూ బనకచర్ల ప్రాజెక్ట్ విషయంలో రాజకీయంగా ఎత్తుకుపైఎత్తు వేస్తుండటంతో.. రాబోయే రోజుల్లో ఇది అంశంపై మరింత రగడ ఖాయమనే చర్చ జరుగుతోంది.

# రేషన్ షాప్‌ల వద్ద 'క్యూఆర్ కోడ్' పోస్టర్లు.. ఫిర్యాదులు స్వీకరించబడును!

అమరావతి,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పని చేస్తోంది. ఇందులో బాగంగా రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ సరుకుల పంపిణీలో నూతన విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ప్రతి రేషన్ షాప్ వద్ద 'క్యూఆర్ కోడ్' పోస్టర్లను ఏర్పాటు చేసింది. రేషన్ కార్డు దారులు ఆ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి.. తమ అభిప్రాయాలు, ఫిర్యాదులు తెలియచేయవచ్చు. అభిప్రాయాలు, ఫిర్యాదుల కోసం ఏర్పాటు చేసిన వెబ్ ఫారమ్‌లో సరైన వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. ప్రజల నుంచి వచ్చిన స్పందనలు నేరుగా ఉన్నతాధికారులకు చేరుతాయి. అప్పుడు డీలర్లపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారు. 'క్యూఆర్ కోడ్' పోస్టర్లపై మంత్రి నాదెండ్ల మనోహర్ స్పందించారు. 'రాష్ట్ర ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పని చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ సరుకుల పంపిణీలో నూతన విధానాన్ని ప్రవేశపెట్టాం. ప్రతి రేషన్ డిపో వద్ద క్యూఆర్ కోడ్ పోస్టర్లు ఏర్పాటు చేశాం.ం అమలు చేశాం. ఇంటింటా రేషన్ పేరిట మొబైల్ యూనిట్లతో పంపిణీ కన్నా.. ప్రస్తుతం డిపోల వ్యవస్థలో మెరుగైన ఫలితాలు వస్తున్నాయి. నేటి నుంచి 65



ఎల్లా పైబడిన వృద్ధులు, దివ్యాంగుల కోసం 5 రోజుల ముందే ఇంటికే రేషన్ సరఫరా చేసే విధానం ప్రారంభించాం. జులై రేషన్‌ను జూన్ 26వ తేదీ నుంచే పంపిణీకి చేస్తున్నాం. ప్రజల అభిప్రాయాలే మార్గదర్శకంగా మారే ఈ వ్యవస్థలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలి' మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపుని చ్చారు.

# ట్రంప్ ని అలా వదిలేయకండి..



సెంట్రల్ డెస్క్:ప్రపంచంలో ఎవరు ఏమైపోయినా.. ఎవరు ఏమనుకున్నా.. తాను అనుకున్న పని తాను చేస్తానని.. తాను చెప్పాలనుకున్నది తాను చెబుతాన ని.. జనాలు నవ్వుకున్నా, తిట్టుకున్నా తనకు సంబంధం లేదు అన్నట్లుగా ఉంటుంది డొనాల్డ్ ట్రంప్ వ్యవహారశైలి అనే మాటలు ఇటీవల బలంగా వినిపిస్తున్నాయి. ఈ సమయంలో మరోసారి మోడీకి మండే మాటలు మాట్లాడారు ట్రంప్.అవును... భారత్ - పాకిస్థాన్ ల మధ్య అణుయుద్ధాన్ని తానే ఆపానని ఇప్పటికే చాలాసార్లు ప్రకటించారు అమెరికా అధ్యక్షుడు ట్రంప్. దీనిపై జీ7 సదస్సు వేదికగా పండు ఒలిచి నోట్లో పెట్టినంత స్పష్టంగా మోడీ క్లారిటీ ఇచ్చారు. అనంతరం ట్రంప్ మాట మార్చారు.. సీజ్ ఫైర్ కు ఆ ఇరు దేశాలే కారణమని సైడ్ అయిపోయారు. కట్ చేస్తే తాజాగా మరోసారి అవే వ్యాఖ్యలు చేశారు.

బుధవారం నెదర్లాండ్స్ లోని హేగ్ లో జరిగిన నాటో శిఖరాగ్ర సమావేశం లో పాల్గొన్న ట్రంప్.. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా... తాజాగా ముగిసిన ఇజ్రాయెల్ ఇరాన్ మధ్య యుద్ధం.. అవిరామంగా సాగుతున్న రష్యా - ఉక్రెయిన్ మధ్య వార్ గురించి ప్రస్తావించారు. అయితే వాటన్నింటికంటే భారత్ - పాక్ యుద్ధాన్ని ఆపడం ముఖ్యమైనదని చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా.తాను వరుస ఫోన్ కాల్స్ తో యుద్ధం ముగించానని.. మీరు ఒకరితో ఒకరు పోరాడితే తాము ఎలాంటి వాణిజ్య ఒప్పందం చేసుకోమని భారత్, పాక్ దేశాలకు తేల్చిచెప్పానని అన్నారు. అనంతరం మోడీ తనకు గొప్ప స్నేహితుడని.. పాక్ జనరల్ ఆకట్టుకునే వ్యక్తి అని చెప్పిన ట్రంప్.. వారు కూడా వాణిజ్య ఒప్పందమే కావాలని చెప్పారని పేర్కొన్నారు. ఆ విధంగా భారత్ పాక్ ల మధ్య అణుయుద్ధాన్ని తాము ఆపామని డొనాల్డ్ ట్రంప్ నాటో శిఖరాగ్ర సమావేశం అనంతరం వ్యాఖ్యానించారు. దీంతో... ట్రంప్ వ్యవహారశైలిపై నెట్టింట సెటైర్లు పడుతున్నాయి. ఇందులో భాగంగా... ట్రంప్ ని అలా వదిలేయకండి.. ఎవరికైనా చూపించండి అంటూ కామెంట్లు పెడుతున్నారు నెటిజన్లు. దీంతో... ఈ వ్యాఖ్యలను కాంగ్రెస్ తీవ్రంగా పరిగణిస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్రంపై విమర్శలు చేసింది. ఈ సందర్భంగా... ట్రంప్ మాట్లాడిన వీడియోను 'ఎక్స్'లో పోస్టు చేసిన కాంగ్రెస్ సీనియర్ నేత జై రాం రమేశ్.. మే 10 నుంచి ట్రంప్ ఇలా చెప్పడం 18వసారి అని అసహనం వ్యక్తంచేశారు. ట్రంప్ ఒత్తిడికి లొంగిపోయి ప్రధాని భారత ప్రయోజనాలను తుంగలోతొక్కారని ఆ పార్టీ నేత పవన్ ఖేరా వ్యాఖ్యానించారు.

# టూవీలర్లకు టోల్ ఫీజు ప్రచారం...



న్యూఢిల్లీ,జులై 15 నుండి నేషనల్ హైవేలపై టూవీలర్లకు కూడా టోల్ ఫీజు వసూలు చేస్తారంటూ సామాజిక మాధ్యమాల్లో, కొన్ని వార్తాపత్రికలలో వస్తున్న వార్తలను కేంద్ర రహదారులు.. రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గట్టిగా ఖండించారు. ఈ ప్రచారం అవాస్తవం అని, ప్రజలు ఆందోళన చెందవద్దని ఆయన స్పష్టం చేశారు.గత కొన్ని రోజులుగా నేషనల్ హైవేలపై ద్విచక్ర వాహనాలకు కూడా టోల్ వసూలు చేస్తారన్న వార్తలు విపరీతంగా ప్రచారంలో ఉన్నాయి. ఈ వార్తలు ప్రజలలో ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులలో తీవ్రమైన ఆందోళనను రేకెత్తించాయి. ఇంధన ధరలు ఇప్పటికే భారంగా మారిన నేపథ్యంలో టోల్ ఫీజు భారం మరింత పెరగనుందని చాలామంది ఆందోళన చెందారు. అయితే, ఈ వార్తలపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తక్షణమే స్పందించి, వాటిని పూర్తిగా ఖండించారు.

గడ్కరీ ప్రకటన

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మీడియాతో మాట్లాడుతూ "టూవీలర్లకు టోల్ ఫీజు వసూలు చేయాలని ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ద్విచక్ర వాహనాలకు టోల్ ఫీజు నుండి పూర్తి మినహాయింపు కొనసాగుతుంది" అని స్పష్టంగా ప్రకటించారు. ఈ ప్రకటనతో ద్విచక్ర వాహనదారులకు పెద్ద ఊరట లభించింది. టోల్ వసూలుకు సంబంధించి వస్తున్న వార్తలు కేవలం వదంతులు మాత్రమేనని, వాటిని నమ్మవద్దని ఆయన ప్రజలకు సూచించారు.

పూర్వపు విధానం కొనసాగింపు

భారతదేశంలో ద్విచక్ర వాహనాలకు నేషనల్ హైవేలపై టోల్ ఫీజు నుంచి ఎప్పుడూ మినహాయింపు ఉంది. ఈ మినహాయింపు కొనసాగుతుందని గడ్కరీ మరోసారి ధ్రువీకరించారు. హైవేలపై ద్విచక్ర వాహనాలకు ప్రత్యేకంగా లేన్లు ఉండకపోవడం, వాటి వేగం , భద్రత దృష్ట్యా ఈ మినహాయింపును అందిస్తున్నారు. చిన్న తరహా వాహనాలు.. సామాన్య ప్రజల ప్రయాణ సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ విధానం అమలులో ఉంది.

ప్రచారాల పట్ల జాగ్రత్త

సామాజిక మాధ్యమాలలో తప్పుడు సమాచారం , వదంతులు చాలా వేగంగా వ్యాపిస్తున్నాయి. ఇటువంటి ప్రచారాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నితిన్ గడ్కరీ పరోక్షంగా సూచించారు. ప్రభుత్వ నిర్ణయాలకు సంబంధించిన అధికారిక సమాచారం కోసం విశ్వసనీయ వర్గాలను మాత్రమే అనుసరించాలని ఆయన పరోక్షంగా తెలిపారు. తప్పుడు వార్తలను నమ్మి ఆందోళన చెందవద్దని, ఏదైనా కొత్త విధానం అమలైనట్లయితే, ప్రభుత్వం అధికారికంగా ప్రకటిస్తుందని గుర్తు చేశారు.కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ స్పష్టమైన ప్రకటనతో టూవీలర్లకు టోల్ ఫీజు వసూలు అంశంపై నెలకొన్న గందరగోళం తొలగిపోయింది. ద్విచక్ర వాహనదారులకు టోల్ భారం ఉండదని, ప్రస్తుత మినహాయింపు కొనసాగుతుందని మరోసారి స్పష్టమైంది. భవిష్యత్తులో ఇటువంటి అవాస్తవ ప్రచారాలపై ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలని ఈ ఘటన మరోసారి రుజువు చేసింది.

# కాంగ్రెస్ మెడకు బిసి రిజర్వేషన్ల ఉచ్చు

హైదరాబాద్,స్థానిక ఎన్నికలు మూడు నెలల్లోగా నిర్వహించాలన్న హైకోర్టు ఆదేశించడంతో బిసి రిజర్వేషన్లు లేకుండా ముందుకు వెళ్లడం కుదరని పనిగా కాంగ్రెస్‌లో చర్చ జరుగుతోంది. రిజర్వేషన్లపై విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. కుటగణన చేశామని గొప్పలు చెప్పుకున్న ప్రభుత్వానికి అమలు పెద్ద సవాల్ కానుంది. కేంద్రం అమలు చేయకుండా బిల్లుపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. పార్టీపరంగా రిజర్వేషన్లు ఇచ్చి ఎన్నికలకు వెళ్లడంపై రాష్ట్ర ప్రభుత్వం ఆశలు పెట్టుకున్నది. దీనిని మిగతా పార్టీలు ఎలా స్పందిస్తాయన్నది కూడా ముఖ్యమే. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే అధికారులకు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో చర్చలు జరుపుతున్నారని సమచారం. కు ఈ మేరకు కాగ్రెస్ శ్రేణులు కూడా సంకేతాలిచ్చారు. మరోవైపు హైకోర్టు తీర్పును స్వాగతిస్తూ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కూడా ఇదే విషయాన్ని చెప్పారు. పార్టీపరంగా 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడంపై త్వరలోనే పీసీసీ స్థాయిలో నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. రిజర్వేషన్ల ఖరారుకు హైకోర్టును సర్కారు నెల రోజులు, ఆ తర్వాత ఎన్నికల నిర్వహణకు ఈసీ రెండు నెలల సమయం అడిగాయి. దీనిని దృష్టిలో ఉంచుకొనే స్థానిక ఎన్నికల నిర్వహణకు హైకోర్టు 3 నెలల గడువును నిర్దేశించింది. ఇచ్చిన మాట ప్రకారం నెల రోజుల్లో బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. కానీ బీసీ బిల్లులపై రాష్ట్రపతి నిర్ణయం రాకున్నా.. నేరుగా రిజర్వేషన్లు ప్రకటిస్తే కోర్టులు అడ్డుకున్నా.. నెలరోజుల గడువు మించిపోయే అవకాశం ఉన్నది. ఈ నేపథ్యంలో అఖిలపక్షాన్ని ఢిల్లీకి



తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి చేయడం, కాదనుకుంటే నేరుగా కాంగ్రెస్ పార్టీ పరంగా 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని అధికార పార్టీ భావిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. 22 నుంచి 23 శాతం చట్టపరంగా, మరో 20 శాతం పార్టీపరంగా జనరల్ స్థానాల్లో బీసీలకు సీట్లు కేటాయించాలని భావిస్తున్నట్లు సాచారం. 42 శాతం స్థానాలను బీసీలకు కేటాయిస్తే అనివార్యంగా మిగిలిన పార్టీలు కూడా బీసీలకు అదేస్థాయిలో రిజర్వేషన్లు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. తద్వారా తాము అనుకున్న లక్ష్యం నెరవేరుతుందని, తర్వాత కేంద్రంపై ఒత్తిడి కొనసాగించవచ్చనేది రాష్ట్ర ప్రభుత్వం ఆలోచనగా కనిపిస్తున్నది. అయితే ఇది ఎలా సాధ్యమన్నది కూడా ప్రశ్నే. పార్టీ కూడా దీనిపై కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

# జగన్‌లో అప్పటి ఊపు... ఉత్సాహం ఇప్పుడెక్కడ ?

అమరావతి,వైసిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిలో ఊపు ఉత్సాహం కరువైందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తుంది. సహజంగా జగన్ రాజకీయంగా ఏం మాట్లాడినా.. ఎవరిపై విమర్శలు చేసినా చాలా ఉత్సాహంగా ఉంటారు. ఉత్సాహంగా వ్యాఖ్యానిస్తారు. కానీ, తాజాగా బుధవారం జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో మాత్రం ఆయన చాలా నిరుత్సాహంగా కనిపించారు. ఆయన మాట్లాడే విధానం, మాట్లాడే తీరు గమనిస్తే జగన్లో స్పష్టంగా తేడా కనిపించింది. మరి ఈ తేడా ఎందుకు వచ్చింది.. అంటే ప్రస్తుతం ఆయన చుట్టూ అనేక కేసులు ముసురుకున్నాయి. ప్రధానంగా ఆయన ఇంటి నుంచి కారును పోలీసులు తీసుకువెళ్లడంపై మానసికంగా ఆయన ఇబ్బంది పడుతున్నట్టు తెలుస్తోంది. సహజంగా కేసు పెట్టి అందులో జగన్ పేరు చేర్చడంపై కంటే కూడా వ్యక్తిగతంగా ఆయన ఇంటి నుంచి కారు తీసుకెళ్లడాన్ని జగన్ కొంచెం ఫీల్ అవుతున్నారని సమాచారం. దీనికి తోడు పార్టీ నాయకుల పై వరుసగా నమోదు అవుతున్న కేసులు కూడా జగన్‌ను ఇబ్బంది పెడుతున్నాయి. పైకి గంభీరంగా ఉన్నా.. అరెస్టయిన వారిని బయటకు తీసుకురాలేని పరిస్థితి వంటి పరిణామాలు కూడా మానసికంగా జగన్ ను కుంగ తీస్తున్నాయని చెప్పాలి. సహజంగా ధైర్యం, సాహసం వంటి వాటికి జగన్ పేరును పర్యాయపదంగా చెబుతారు. కానీ, మారుతున్న కాలం.. మారుతున్న పరిస్థితులు వంటివి జగన్ను ఆ దిశగా నడిపించడంలో కాస్త వెనుకబాటు కనిపించింది. ఇదే సమయంలో నిరుత్సాహానికి కారణం కూడా



అదేనని చెప్పాలి. దీనికి తోడు ఏడాది కాలంలో కూటమిలో అనైక్యత చోటు చేసుకుంటుందని అనుకున్నారు. అంతేకాదు.. ఎక్కడో ఒక చోట విభేదాలు వస్తాయని జగన్ అంచనా వేసుకున్నారు. కానీ అలా జరగలేదు. పైగా కూటమి బలంగా ఉందన్న సంకేతాలు తాజాగా జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ద్వారా స్పష్టమైంది. ఇది కూడా జగన్కు మానసిక ఆవేదనను పెంచిందని చెప్పాలి. ఎలా చూసుకున్నా రాజకీయంగా జగన్ కి ఇప్పుడు ఒక సంక్లిష్ట పరిస్థితి అయితే ఏర్పడిందనేది పరిశీలకులు చెబుతున్న మాట. అందుకే ఆయనలో ఊపు, ఉత్సాహం కొరవడిందని అంటున్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# స్పీడ్ ఆఫ్ డెవలప్‌మెంట్.. పవన్ వెర్షన్!



అమరావతి,స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్.. అనే మాట విన్నాం. కానీ, తొలిసారి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్..స్పీడ్ ఆఫ్ డెవలప్‌మెంట్ గవర్నమెంట్ అనే విషయాన్ని వెల్లడించారు. ఇప్పటి వరకు ఆయన ఎప్పు డూ స్పీడ్ ఆఫ్ డెవలప్‌మెంట్ గురించి ఎక్కడా ప్రస్తావించలేదు. కానీ, తొలిసారి దీని గురించి స్పందించారు. రాజమండ్రిలో ఆయన అఖండ గోదావరి ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టిన సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో వేగవంతమైన అభివృద్ధి, సుస్థిర ప్రభుత్వంపై కామెంట్లు చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే.. మరీ ముఖ్యంగా వేగవంతమైన అభివృద్ధి జరగాలంటే.. అది సుస్థిర ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందన్నారు. దీనికి శక్తిమంతులైన నాయకులు ఉండాల్సిన అవసరం ఉంద న్నారు. శక్తిమంతులైన నాయకులు ఉంటేనే వేగవంతమైన అభివృద్ధి జరుగుతుంది. ఇది సుస్థిర ప్రభు త్వంతోనే సాధ్యమవుతుంది. అని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. పరోక్షంగా ఆయన సీఎం చంద్రబా బు, కూటమి ప్రభుత్వాలను ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేసినట్టు తెలుస్తోంది. ఇక, ప్రస్తుతం చేపట్టిన అఖండ గోదావరి ప్రాజెక్టు ద్వారా వచ్చే రెండు మూడేళ్లలోనే ప్రపంచ పర్యాటకు లు రాష్ట్రానికి క్యూ కడతారని చెప్పారు. తద్వారా రాష్ట్రానికి ఆదాయం చేకూరుతుందని వెల్లడించారు. అంతేకాదు.. పర్యాటక రంగంలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కూడా మెరుగు పడుతున్నాయని చెప్పారు. ఈ ప్రాజెక్టు పూర్తి చేయడం ద్వారా ఏటా 4 లక్షల మంది దేశ, విదేశీ పర్యాటకులు రాష్ట్రానికి వచ్చే అవకాశం ఉందనితద్వారా స్థానికులకు వ్యాపారాలు పుంజుకుని,రాష్ట్రానికి కూడా మేలు జరుగుతుంద న్నారు. ఇదంతా స్పీడ్ ఆఫ్ డెవలప్మెంటు ద్వారానే సాధ్యమవుతోం దని చెప్పారు.

# భారత రక్షణ సమాచారాన్ని చైనా మాకు అందించింది...



పాకిస్తాన్,పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఏం మాట్లాడినా సంచలనంగా మారుతోంది. ఆపరేషన్ సిందూర్, పహల్గామ్ దాడి సమయంలో ఆయన స్వయంగా పాకిస్తాన్ ఉగ్రవాదులకు ఆశ్రయం ఇచ్చిందని ఒప్పుకున్నారు. ఆ తర్వాత పాక్ నేషనల్ అసెంబ్లీలో భారత దాడుల గురించి తప్పుడు ప్రకటనలు చేస్తూ దొరికిపోయారు. సొంత దేశ ప్రజలతోనే ఛీత్కారాలు ఎదుర్కొన్నారు. తాజాగా, ఆయన ప్రధాని నరేంద్రమోడీని ఉద్దేశిస్తూ అసభ్యకరమైన భాష మాట్లాడటంపై సొంత దేశంలోనే విమర్శలు వస్తున్నాయి. ఇలాంటి భాష వాడితే భారత్‌తో చర్చలు ఎలా ముందుకు వెళ్తాయని ఆ దేశానికి చెందిన మాజీ రాయబారి హుస్సేన్ హక్కానీ ఆసిఫ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే, ఆపరేషన్ సిందూర్ సమయంలో తమకు చైనా సహకరించిందంటూ ఖవాజా ఆసిఫ్ వెల్లడించారు. ఓ ఇంటర్వ్యూలో ఆయన స్వయంగా దీనిని ఒప్పుకున్నారు. భారత వైమానిక రక్షణ వ్యవస్థ, క్షిపణులు, వైమానిక మార్గాలు, ఆపరేషన్ వంటి అంశాలపై చైనాకు భారత్‌తో సమస్యలు ఉన్నాయని పాక్ రక్షణ మంత్రి అన్నారు. భారత రక్షణ వ్యవస్థకు సంబంధించిన వివరాలను చైనా తమకు అందించిందని చెప్పారు. భారత్‌తో చైనాకు కూడా ఇబ్బందులు ఉన్నాయని, పాక్ తో ఇంటెలిజెన్స్ పంచుకోవడం చాలా సాధారణమని చెప్పారు. వ్యూహాత్మకంగా దగ్గరగా ఉండే రెండు దేశాల మధ్య ఇంటెలిజెన్స్ పంచుకోవడం సాధారణం అని అన్నారు.

## ఎన్నికల సంఘం సంచలన నిర్ణయం

న్యూఢిల్లీ,రాజకీయ పార్టీగా నమోదై ఎన్నికల్లో పోటీ చేయని రాజకీయ పార్టీలపై ఎన్నికల సంఘం కొరడా ఝుళిపించింది. 2019 నుంచి ఇప్పటి వరకు గడిచిన ఆరేళ్లలో ఒక్క ఎన్నికల్లోనూ పోటీ చేయని 345 గుర్తింపులేని నమోదిత రాజకీయ పార్టీలను గుర్తించి వాటిని డీలిస్ట్ చేసే ప్రక్రియను ప్రారంభించింది. ఆయా పార్టీల కార్యాలయాలు కూడా ఎక్కడా లేవని ఈసీ గుర్తించి ఈ నిర్ణయం తీసుకుంది. ఈ జాబితాలో వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన పార్టీలు ఉన్నాయని ఈసీ పేర్కొంది. ఎన్నికల సంఘం వద్ద సుమారు 2800కి పైగా గుర్తింపులేని నమోదిత రాజకీయ పార్టీలు ఉన్నాయి. సాధారణంగా ఒక పార్టీ గుర్తింపు

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com